# రాకడ ప్రార్ధనలు - స్తుతులు


గ్రంథకర్త

**యం. దేవదాసు అయ్యగారు**



గుంటూరు - 2011 వెల: 15.00



Bible Mission HQ Guntur

# ప్రవేశము

యం. దేవదాసు అయ్యగారు రెండవరాకడను గురించి ఎక్కువగా చెప్పిరి. అందరూ రెండవ రాకడకు సిద్ధపడుటకు అనేక ఉపదేశములు చేసిరి. ఈ పుస్తకము నందలి ప్రార్ధనలు అనేకులు ఉపయోగించి, రాకడకు తయారగునట్లు లోకమందలి దృష్టాంతములను, వాక్యమందలి వృత్తాంతములను తీసి ప్రార్థించిరి. ఇట్టి ప్రార్ధనలు చేయువారు రాకడలో పాలుపొందుటకు అర్హులగుదురు.

ఈ పుస్తకము అనేకులను రాకడకు ఆయత్తపరచునట్లు త్రియేక తండ్రి దీవించునుగాక!

**పెండ్లికుమారుడుగా రానైయున్న**
**ప్రభువునందలి**
**రెవ. డా॥ యన్. సత్యానందం**
ప్రసిడెంట్, బైబిలు మిషను

గుంటూరు - 2011

Bible Mission HQ Guntur

# రాకడ ప్రార్థనలు - స్తుతులు

1. ఒక అబ్బాయి దూరదేశములోనుండి 'నేను వచ్చుచున్నానని' ఉత్తరము వ్రాసెను. ఆ అబ్బాయి ఇంటివారు ఆ ఉత్తరము చూచుకొని ఆనందించి, ఆ అబ్బాయి కొరకు ఎదురు చూతురుకదా! అట్లే యేసుప్రభువు వచ్చెదనని చెప్పిరిగదా! వచ్చెదనని చెప్పిన ఆ అబ్బాయి రాకుండునా? ఎప్పుడో ఒకప్పుడు వచ్చునుగదా! ఆ అబ్బాయి ఇంటివారు అతనికొరకు ఎదురుచూచినట్లుగా మనమును యేసు ప్రభువు యొక్క రాకకై ఎదురు చూచిన యెడల, ఆయన వచ్చినప్పుడు ఆయన ఆగమనములో, ఆయనతో ఎగిరి వెళ్ళ గలము. అట్లు ఎదురు చూడగల మనస్సు అనుగ్రహింతువని నమ్మి ఓ ప్రభువా! నిన్ను వందించు చున్నాము.

2. ఆ అబ్బాయి ఫలాని ఓడకు వచ్చుచున్నానని వ్రాసెను. ఆ ఇంటివారు కాకినాడకు ఓడలోవచ్చుచున్న అబ్బాయిని కలిసికొనుటకు వెళ్ళిరి. ఓడ వచ్చినదిగాని ఆ అబ్బాయి ఎందుకో ఆ ఓడమీద రాలేదు. ఆ ఇంటివారు ఆ ఓడను చూచి, అబ్బాయి రానందున తిరిగి ఇంటికి వెళ్లిపోయిరి. అయితే ఆ అబ్బాయి రెండవ ఓడమీద దిగినాడు. తన ఇంటివారెవరును తనను కలిసికొనుటకు రానందున తిరిగి వెనుకకు వెళ్ళిపోయినాడు. అలాగే యేసు ప్రభువు రాకడ ఆలస్యమైనందున అనేకులు వెనుకకు వెళ్ళిపోవుదురు. ఆ అబ్బాయి రెండవ ఓడకు వచ్చినట్లుగా ప్రభువుకూడ వచ్చి, సిద్ధపడియున్నవారిని తనతో కూడ పైకి తీసికొని వెళ్ళును గనుక ఆయన రాకడ ఆలస్యమైనందున ఆగిపోక, ఆయనతో వెళ్ళుటకు సిద్ధము చేయుమని వేడుకొనవలెను. ఓ ప్రభువా! నీ రాకడ ఆలస్యమైనను మేము వెనుకకు తిరిగిపోవువారిలో చేరకుండ, ఎల్లప్పుడు సిద్ధపడియుండు కృప దయ చేయుదువని నమ్ముచు నీకు స్తోత్రములు చెల్లించుచున్నాము.

3. ఒక యౌవనస్తుడు తన భార్యకు నేను ఫలాని బండికి వచ్చుచున్నాను, ఆ బండికి నీవు వచ్చి నన్ను కలిసికొనవలెను, లేనియెడల నేను ఇంటికి రాను

అని వ్రాసెను. అతని భార్య వంటలు మొ॥వన్నియు తయారుచేసికొని స్టేషనుకు వెళ్ళెను. ఆ దినము బండి రెండు గంటలు ఆలస్యమైనందున ఆమె ఇంటికి వెళ్ళెను. ఆ తర్వాత బండి వచ్చినది. అతడు దిగి ఆమె కొరకు అంతా చూచి, ఆమె కనబడనందున విచారించి, ఆ బండికే వేరొకచోటికి వెళ్ళెను. అలాగే మనమును ఆయన రాక కొరకు ఎదురుచూచి, తీరా వచ్చుసరికి వెనుకకు వెళ్ళిపోవుదుము, రాకడలో వెళ్ళలేము. గనుక ఆలస్యమైనను ఆయన వచ్చువరకు కనిపెట్టి చూచుచు, సిద్ధపడవలెను. అప్పుడు రాకడలో వెళ్ళగలము. ఓ ప్రభువా! మేము కనిపెట్టుచు సిద్ధపడుచుండగల కృప దయచేయుదువని నమ్మి నీకు స్తుతులర్పించు చున్నాము.

4. ఒకరు ప్రయాణమునకు వెళ్ళవలెనని గోదావరి స్టేషనుకు వచ్చుసరికి బండిదాటిపోయినది. అతడు వెంటనే తెలివితేటలు గలిగి రాజమండ్రి స్టేషనులో బండి అరగంట ఆగునని తెలిసికొని, వెంటనే రిక్షా కట్టించుకొని గబగబ పరుగెత్తించి స్టేషను చేరెను. వెంటనే టిక్కెట్టు కొని బండిలో ప్రవేశించినాడు. అలాగే మనమును తెలివితేటలు ఉపయోగించుకొని, గబగబ పనులు చేసికొని రాకడకు సిద్ధపడవలెను. ఒకవేళ వెనుకబడినను ఏదో ఒక విధముగా అందుకొనవలెను. ఆ ప్రయాణీకునివలె తెలివితేటలు ఉపయోగించి రాకడలో పాల్గొనుకృప దయచేయుదువని నమ్మి నీకు స్తోత్రములు చెల్లించుచున్నాము.

5. ఒకడు మగ్గముపై దుప్పటి నేయుచు ఈ కొంచెమే ఉన్నదిగదా! అతిత్వరగా నేసి వెంటనే వస్తాను, మీరువెళ్ళి బండికి టిక్కెట్టు తీసికొనండని చెప్పెను. అతడు ఆదుప్పటిని త్వరత్వరగానేసి, ఎగబెట్టేసరికి ఆలస్యమైనది, బండికి అందుకొనవచ్చునను కొన్నాడు గాని పనులవలన ఆలస్యమైనందున, అతడు వెళ్ళుసరికి ఆ బండి వెళ్ళిపోయెను. అలాగే ఆయా పనులు పెట్టుకొని బండిని అతడు దాటిపోజేసినట్లు, మనమును నానాపనులు పెట్టుకొని రాకడలో వెళ్ళలేక వెనుకబడి పోవుదుము. ఓ ప్రభువా! నీ రాకడ విషయములో మేమట్టి అశ్రద్ధ చూపకుండ మమ్మును సిద్ధపర్చుదువని నమ్మి నీకు ప్రణుతులు చెల్లించుచున్నాము.

6. కొందరు అనేకమైన పనులు కల్పించుకొని పనులలోనే పడిపోయి ఈదులాడుకొనుచు, ప్రభువుయొక్క రాకడను మరచి పోవుదురు. ఇంతలో ఆయన వచ్చి ఎదురుచూచుచు, సిద్ధపడినవారిని తీసికొని పోవును. పనులు ముగించుకొని తేరి చూచునప్పటికి రాకడ వచ్చి వెళ్ళిపోవడము కూడ జరుగును. అలాగే సమయమంతా పనులు, పనులు అని పనిపాటలతోనే కాలము గడుపువారు రాకడలో ప్రభువును కలిసికొనలేరు. మేమట్లు లోకపు పనులలో మునిగి, నీ రాకడను నిర్లక్ష్యము చేయకుండ ఉండే కృప దయచేయుదువని నమ్మి నీకు స్తోత్రములు  చెల్లించుచున్నాము.

7. ప్రతి దినము రాకడ ప్రార్థన, రాకడ వాక్యములు, రాకడ తలంపు కలిగియుండక పోయిన రాకడలో ఎత్తబడలేరు. గనుక నిత్యమును, ఏ పనిచేయుచున్నను రాకడ ధ్యానము, రాకడ తలంపు కలిగియుండిన రాకడలో ఎత్తబడగలరు. నీ రాకడ తలంపు నిత్యము మాలోనుంచుదువని నమ్ముచున్నాము. నీకు నిత్య స్తోత్రములు.

8. ఒక రైతు కళ్ళమునందున్న ధాన్యములోని రాళ్ళను ఏరి పారవేసి, జల్లెడలోవేసి జల్లించి, చేటలోవేసి చెరిగివేసి, శుభ్రముగానున్న గట్టిగింజలను జాగ్రత్తచేసెను. అలాగే మనలోనున్న చెడు ఆలోచనలు, చెడు పనులు మొదలగు రాళ్ళన్నిటిని, చెత్త, పొట్టువంటి పాపములను జల్లించి చెరిగివేసికొనవలెను. అప్పుడు మనమును గట్టిగింజలుగా ఏర్పడి రాకడలో ఎత్తబడగలము. ఓ ప్రభువా! అట్లు మమ్మును మేము శుభ్రము చేసికొనగల సహాయము దయచేయుదువు గనుక నీకు నిత్యమంగళ స్తోత్రములు.

9. ఒక స్త్రీకి చంటిబిడ్డ కలదు. ఆ బిడ్డ ఆడుకొనుచు బురద చేసికొనగా, బిడ్డను ఆమె నీళ్ళతో కడిగి శుద్ధి చేసినది. అయితే ఆ బిడ్డ మరల ఆడి మరల బురద చేసికొనగా, తిరిగి తల్లి కడిగివేసినది. అనేకమార్లు ఆ బిడ్డ బురద చేసికొనగా అలాగే తల్లి అనేకమార్లు కడిగి శుద్ధిచేసిన రీతిగా, మనమును మన మనస్సులోనికి చెడ్డతలంపులు వచ్చినప్పుడు, వెంటనే యేసు రక్తముతో ఆ పాపము శుద్ధిచేసుకొను

అలవాటు కలిగియుండవలెను. వెంటనే శుద్ధిచేసికొనకపోయిన ఆలస్యమైపోవును గనుక (పాపపు తలంపు రాగానే), పాపములో పడగానే ప్రభువు రక్తముతో పవిత్రము చేసికొనవలెను. ఎన్ని మారులైనను 'యేసు రక్తమే జయము' అనునది అలవాటు చేసికొనవలెను. ఓ ప్రభువా! మేమట్లు శుద్ధిచేసికొని, నీ రాకడలో పాల్గొను కృప దయచేయుదువని నమ్మి వందించుచున్నాము.

10. దూర ప్రయాణము చేయువారు ఉదయం కాఫీ, మధ్యాహ్నము, సాయంకాలము భోజనము, 4 గంటలకు మరల కాఫీ తీసికొనినగాని ప్రయాణము చేయలేరు. అలాగే మనమును ఆకలి వేసినప్పుడెల్ల ప్రభువుయొక్క శరీర రక్తములు అను ఆహారమును తీసికొని అనుభవింపక పోయిన రాకడ ప్రయాణము చేయలేము. గనుక సంస్కార భోజనము పుచ్చుకొనిన రాకడలో వెళ్ళగలము. ఓ ప్రభువా! నీవు ఏర్పాటు చేసిన సంస్కారపు విందును అనుభవించి, బలముపొంది, నీ రాకడలో పాల్గొను కృప దయచేయుదువని నమ్మి నీకు నుతులర్పించు చున్నాము.

11. క్రైస్తవ సంఘములోని కొందరు రాకడ సమీపమను చున్నారు. కొద్దిమంది మాత్రమే నమ్ముచున్నారు, కొందరు నమ్ముటలేదు. ఓ ప్రభువా! ఒకవేళ నమ్మనివారు, నమ్మిన యెడల వారిని రాకడకు సిద్ధపరచుము. నమ్మినవారిని ఇంకను సిద్ధపర్చుము. నమ్మని వారికి నమ్మకము పుట్టించుము. నమ్మిన వారిని, నమ్మలేని వారిని, నమ్మనివారిని రాకడకు సిద్ధపర్చుము. ఇట్లు నీ సంఘమును రాకడకు ఆయత్తము చేయుదువని విశ్వసించి స్తుతులర్పించు చున్నాము.

12. అన్యులలో ప్రభువును నమ్మినవారున్నారు, నమ్మనివారు కూడా ఉన్నారు. వారు సిద్ధపడుట ఎట్లు? ఎవరో ఒకరు వెళ్ళి, వారికి రాకడను గురించి బోధించవలెను. లేనియెడల వారికి నమ్మకము కలుగదు. వారు సిద్ధపడినను సరే, సిద్ధపడకపోయినను సరే, వారిని కూడ సిద్ధపర్చుమని ప్రార్థించుచున్నాము.

13. గురుతులు అయిన తర్వాత రాకడ జరుగునని క్రైస్తవులు చెప్పుచున్నారు. అయితే ఎప్పుడును ఒకేలాగున్నది, ఈ గురుతులు ఎప్పుడును ఒకేరీతిగా నున్నవి, ఈ గురుతులన్ని ఇదివరకే ఉన్నవి, క్రొత్తవేవియు లేవు అని ఆక్షేపణ చేయు వారిని గురించి ప్రార్థించవలెను. గనుక భక్తులైనవారు గురుతులు

ఏవేవి, ఏ సంవత్సరమున, ఏయే దేశములలో జరిగినవో, ఇంకా క్రొత్త గురుతులు ఏమి జరుగునో, బైబిలులో లేని ఎక్స్ట్రా (Extra) గురుతులు వ్రాయునట్లు ప్రార్థింపవలెను. ఇవి లోకమంతా తెలిసికొనునట్లు భక్తులు త్వరలో వ్రాయునట్లు ప్రార్థింపవలెను. ఓ ప్రభువా! అట్టి భక్తులనులేపి రాకడ గుర్తులను వ్రాసి, లోకమునకు చూపించు కృప దయచేయుదువని నమ్మి నీకు కృతజ్ఞతార్పణలు చెల్లించుచున్నాము.

14. లోకములో కొందరు సువార్త పత్రికలు అచ్చువేసి, అనేకులకు పంపు చున్నారు. వారు కేవలము దేవునివలన ప్రేరేపింపబడి, అట్టి వాటిని వ్రాసి అనేకులకు పంపుచున్నారు. అట్టి పత్రికలలో కొన్ని 1) నవీనకాల విషయములు తెలియచేయునవి, 2) మరికొన్ని రెండవరాకడ విషయములు తెలియజేయునవి, 3) కొన్ని ప్రవచనకాల విషయములు తెలియజేయునవై యున్నవి. పై మూడు రకముల పత్రికలు వారు ఊరకనే అనేకులకు పంపు చున్నారు. వీటన్నిటిని ప్రభువు దీవించు చున్నారు గనుక ఆయనకు మంగళ స్తోత్రార్పణలు.

15. క్రీస్తుమతము పుట్టి 19 శతాబ్ధములు అయినది. ఈ 19 శతాబ్ధములలో ఏయే సంగతులు జరిగినవి, ఎందరు క్రైస్తవులయినది, ఎన్ని రాకడ గురుతులు జరిగినవి, ఏయే గురుతులు ఏయే కాలములలో జరిగినవి, ఆ గురుతులు జరిగినపుడు వాటి పని ఏమిటయినది, ఆ గురుతులవలన ప్రభువునకు ఏమి మహిమ కలిగినది; ఈ విధముగా లోకములో జరిగిన మరియు జరుగుచున్న విషయములు ఒక పుస్తకములో అయ్యగారు వ్రాసియుంచిరి. ఆ పుస్తకమును అయ్యగారు జాగ్రత్తగా దాచి ఉంచగా, ఎవరో ఒకరు మరల పంపించెదనని తీసికొని వెళ్ళిరని తెలిసి, ఆ పుస్తకము కొరకు వ్రాయగా, పంపిచెదనన్నారుగాని ఇంతవరకు పంపలేదు. ఆ పుస్తకము మరల దొరికిన యెడల రాకడ గురుతులన్నియు అందులోగలవు గనుక ఎంత పనియైనను చేయవచ్చును. అతిత్వరలో దొరుకునట్లు ప్రార్థన చేయండి. ఆ పుస్తకము దొరికినప్పుడు, అన్యులు మరియు క్రైస్తవులు ఏలాగున్నది, ఏమేమి పొందినది తెలియగలదు. ప్రార్థన: దయగల తండ్రీ! నీ రాకడకు కొందరు సిద్ధపడుచున్నారు,

కొందరు సిద్ధపడుటలేదు, కొందరు సిద్ధపడవలెనని తలంచుచున్నారు, కొందరు సిద్ధపడవలెనని ప్రయత్నము చేయుచున్నారు గాని సిద్ధపడలేక పోవుచున్నారు. గనుక మమ్ములనందరిని నీ రాకడకు సిద్ధపరచి, నీతో మేమందరము బయలుదేరు భాగ్యము అనుగ్రహించి సిద్ధపరచి, సిద్ధపరచి స్థిరపరచుము.

16. సౌలురాజు తైలాభిషేకమును, ఆత్మను పొందినను, యుద్ధములలో జయము పొందినను చివరకు తప్పిపోయెను. అలాగే కొందరు క్రైస్తవులు చివరివరకు అనగా రాకడ వరకు బాగుండి, రాకడ ఈ వేళో రేపో అనగా తప్పిపోయి నిరాశపడుదురు. మేము అట్టివారము కాకుండా కాపాడుదువని నమ్మి నిన్ను స్తోత్రించుచున్నాము.

17. ఎప్పుడునూ రక్షణను గురించిగాని, రాకడను గురించిగాని, విననివారు ఆఖరు దినమున విని తయారు కావచ్చును. ఏలాగనగా రైలుబండికి ఆలస్యముగా బయలుదేరిన కొందరు పరుగెత్తుకొని వచ్చి, రైలు కదిలే సమయములో ఎక్కుదురు గదా! సిలువ మ్రానుమీద, దొంగ ఆ క్షణములో మారుమనస్సు పొందెనుగదా! అట్లు మేమును రాకడలో పాల్గొనుకృప దయచేతువని నమ్మి నిన్ను స్తుతించుచున్నాము.

18. తీరా మరణ సమయమున కొందరు మారుమనస్సు పొంది, బహు కొద్ది మంది రాకడకు సిద్ధపడుదురు. అది నీ కృప, అట్టి కృప మాకును దయచేయుము. నీకే ప్రణుతులు.

19. కొందరు మంచి పనిమీద ఉండి, ముగించునప్పటికి రాకడ వచ్చును. భోజనము సగము తినుచున్నప్పుడు, రాకడ వచ్చినయెడల, తయారుగానున్నవారు వెళ్ళిపోవుదురు. మేమే స్థితిలో ఆ సమయమునకు ఉన్నను, రాకడలో ఎత్తబడగల కృప దయచేయుదువు గనుక నీకు మా నమస్కారములు.

20. కొందరు నిద్రలో ఉండగానే రాకడలో ఎత్తబడుదురు గనుక నీకు మా హృదయ వందనములు.

21. ఒకరు, మరియొక గ్రామములో ఎవరో చనిపోయినారని విని ఏడ్చుచుండగా రాకడలో ఎత్తబడుదురు గనుక నీకు స్తుతులు.

22. ఒకరు స్వస్థానమునకు వెళ్ళుటకు, అనగా కుమార్తె తండ్రి ఇంటికి వెళ్లుటకు ఆశించును. అలాగే సంఘము ప్రభువుయొక్క రాకడ కొరకు ఎదురు చూచుచున్నది. అనగా పెండ్లికుమార్తె, పెండ్లి కుమారుని రాక కొరకు ఎదురు చూచుచున్నది. గనుక ఎదురుచూచు సంఘము రాకడలోనికి వెళ్ళును. ఎదురు చూడనివారు రాకడలోనికి వెళ్ళరు. మేము ఎదురు చూచు వారిగానుండు వీలు కలిగింతువని నమ్మి నిన్ను స్తుతించుచున్నాము.

23. ఒక గ్రామములో చాలా కలహములుండెను. ఒకరు జ్వరముతో నున్న తన కుమార్తెను చూచుటకు వచ్చి, కలహముల యొక్క భయంకర స్థితినిగూర్చి వినెను. ఈ కలహములలో తన కుమార్తెను అక్కడ ఉంచుట అపాయమని తలంచి, తన ఇంటికి తీసికొనిపోయెను. అలాగుననే ఈ లోకము గత్తర లోకము, పాప లోకము, పాప ఫలితములున్న లోకము, అవస్థల లోకము, కరవుల లోకము, వ్యాధుల లోకము, విష పురుగుల లోకము, నిరీక్షణలేని లోకము, మరణలోకము, దయ్యముల లోకము, దయ్యములకు లోబడిన మనుష్యులున్న లోకము. గనుక ప్రభువు మనలను మోక్ష మందిరమునకు తీసికొని వెళ్ళుటకు శీఘ్రముగా వచ్చును. ఇదే రెండవ రాకడ. తండ్రి కుమార్తెను తీసికొని వెళ్ళునప్పుడు 'రాను' అని చెప్పదుగదా! అలాగే మనముకూడ మేఘములోనికి 'రాము' అని చెప్పకూడదు. 'ప్రభువా! తండ్రీ! సిద్ధముగానున్నాను' అని చెప్పవలెను. అట్లు చెప్పగల కృప దయచేయుదువని నమ్మి నిన్ను స్తుతించుచున్నాము.

24. సముద్రముయొక్క కెరటములు రేయింబగళ్లు (పగలు, రాత్రి) గాలివలన శబ్దము చేయుచున్నవి. సముద్ర తరంగములను రేపుచున్న గాలివలె దైవాత్మ భక్తులయొక్క హృదయములను రేయింబగళ్ళు కదిలించుచున్నది. అప్పుడు వారు రక్షణ పొంది అందులకు స్తుతింతురు. మరియు రాకడ వచ్చుచున్నదని స్తుతించుచు సంతోషింతురు. ఓ ప్రభువా! అట్టి రెండు విధములైన స్తుతులు మాకు నేర్పుము.

25. దేవా! నీవు ఏనాడు సూర్య చంద్ర నక్షత్రములను సృజించినావో, ఆ దినము మొదలు నేటివరకు అవి ఆకాశమండలములోనుండి ప్రకాశించు చున్నవి.

జ్యోతులు తమకు నియమింపబడిన మార్గములో ప్రయాణము చేయుచునే ఉన్నవి. అలాగుననే మేము కూడ మా ఆనంద దీపములతో మా మార్గములలో నడుచుచు, స్థిరముగా నుండునట్లు దీవించి నీ రాకడకు సిద్ధపరచుము. నీవు దయచేసిన రక్షణ, రాకడ భాగ్యములను గురించి నిన్ను మహిమపరచు కృప దయచేయుము.

26. దేవా! నీవు కలుగజేసి మాలో పెట్టిన ఆత్మ, ఎల్లప్పుడు నిన్నే తలంచునట్లు చేయుము. ఆత్మవైన నీతో ఏకీభవించుటకు కృప దయచేయుము. మా ఆత్మతో నిన్ను స్తుతించు శక్తి దయచేయుము. మా ఆత్మ నీయొద్దకు వచ్చువరకు రక్షణను గురించియు, రాకడను గురించియు, స్తుతించు ధోరణి దయచేయుదువని నమ్మి నీకు కృతజ్ఞతా స్తోత్రములు చెల్లించుచున్నాము.

27. ప్రభువా! మా వ్రాత స్తుతులు నిజమైన స్తుతులుగా, నీకు ఇష్టమైన స్తుతులుగా మార్చివేయుము. వ్రాత ఎప్పటికైన చెరపవచ్చును గాని, నీ ఆత్మ సహాయముచేత వచ్చిన స్తుతి చెడిపోదు. అట్టి స్తుతి మాకు దయచేయుదువని నమ్మి నిన్ను వందించు చున్నాము.

28. ఓ దేవా! వ్రాత ఎంత నిశ్చయమో, ఎంత నిజమో, మా స్తుతి కూడ అంత నిశ్చయము, నిజమైయుండుటకు కృప దయచేయుము.

29. రక్షణ ఎంత నిశ్చయమో రాకడ అంతనిశ్చయము. మేము స్తుతించు టయు, సిద్ధపడుటయు అంతనిశ్చయమై యుండునట్టి కృప దయచేయుము.

30. మేము పరలోకమునకు వచ్చునప్పుడు, మా పాతశరీరము ఇక్కడ విడిచివస్తాము. మా స్తుతులలోను, మా సిద్ధపడుటలోను, మా నమ్మికలోను ఉన్న కళంకములు ఇక్కడ విడిచిపెట్టు శక్తి దయచేయుము.

31. కలముతో కాగితముమీద స్తుతి ప్రార్థనలు వ్రాసిన ఎప్పటికైనను చెడిపోవును. అయితే మా హృదయమనే కాగితముమీద ఆత్మవ్రాసిన స్తుతి ఎప్పటికిని చెడిపోదు. అట్లు మా హృదయములపై వ్రాయుము.

32. యేసుదాసు అను యౌవనస్థుడు పడమటినుండి రాజమండ్రి వచ్చెను. రోడ్లమీద తిరుగుచు చిరతలు వాయించుచు, చిందులు త్రొక్కుచు,

Bible Mission HQ Guntur

ప్రజలారా! యేసుక్రీస్తు ప్రభువు రెండవసారి వచ్చుచున్నారు. ఈ సంగతి తెలిసికొనండి, ప్రార్థించండి, సిద్ధపడండి అని కేకలువేసి చెప్పేవాడు. అందుచేత ప్రజలు పరుగు పరుగునవచ్చి గుంపుకూడి, వింతగా ఆయన చెప్పుమాటలు వినువారు. అతనికి జీతములేదు, చదువులేదు. ప్రతి ఉదయము వీధులలోనికి వెళ్ళి 12 గం॥ వరకు రోడ్లమీద ప్రసంగముచేసి, ఆ తరువాత చెట్టుక్రింద కూర్చుని, ప్రభువా! ఇప్పటివరకు నీ సేవ చేసివచ్చినాను, నాకు అన్నము పెట్టు అని ప్రార్థించేవాడు. అప్పుడు ఎవరో ఒకరు వచ్చి సంగతి కనుగొని, ఆకువేసి అన్నం పెట్టేవారు. ఒకనాడు ధవళేశ్వరము వెళ్ళి బోధించినాడు. పోలీసువారు అతనిని కొట్టులో పెట్టిరి. అక్కడ ఆయన పోలీసువారికి, ఇన్‌స్పెక్టర్ గారికి బోధచేసెను. అప్పుడు వారు ఇతడు దైవభక్తుడు, ఇతనిని జైలులో వేయరాదని విడిచిపెట్టిరి. గనుక చదువరులు రాకడబోధ ఇంకా ఎక్కువ చేయవలెను. అట్లు బోధించువారిని ఎక్కువమందిని లేపుమని ప్రార్థించండి. ఇతనికి విశ్వాసమువల్ల అన్నము దొరికినది. మరియొక సంగతి ఏదనగా, ఒకప్పుడితడు అడవిలో బడి వెళ్ళుచుండగా పెద్దపులి ఎదురుగా కూర్చుండెను. అతడు చిరతలు వాయించుచు చిందులు త్రొక్కుచు, ఓ పెద్దపులి! నేను నీకు హానిచేయ రాలేదు గనుక నీవు నాకు హాని చేయకూడదని చిరతలు వాయించి ఎగిరి దుమికెను. ఆ పులి పారిపోయెను. అట్టి విశ్వాసమున్నవారు రాకడకు సిద్ధపడగలరు. వారు భూతమును ఎదిరింతురు. ప్రభువా! మేమట్టి విశ్వాసము గలిగి సాతానునెదిరించు కృప దయ చేయుము.

33. గవర్నరుగారు వచ్చుచున్నారనగా ఇండ్లు శుభ్రము చేసికొని, సున్నము వేసికొని, రోడ్లన్ని శుభ్రముగాచేసి సిద్ధముగా నుందురు. అలాగే రాజాధిరాజైన ప్రభువు వచ్చుచుండగా సిద్ధపడరాదా! మేము మరి ఎక్కువగా సిద్ధపడు కృప దయచేయుము.

34. రాజమండ్రిలో క్రొత్తగా రైలుబండి నడిచినప్పుడు ప్రజలు అన్ని ప్రక్కలనుబడి అనగా పొలములలోనుండి, ఇండ్లలోనుండి, బజారులలోనుండి పరుగెత్తుకొని వచ్చేవారు. అలాగే రాకడ అనగా అందరు సిద్ధపడవలెను. తూర్పు,

పడమర, ఉత్తర, దక్షిణముల నుండి ప్రజలు ఏలాగు రైలుబండికి వచ్చుచున్నారో అలాగే రాకడకు అందరూ రావలెను.

35. క్రీస్తుప్రభువా! నీవు మానవులమైన మమ్ములను రక్షించు నిమిత్తము, ప్రత్యేకముగ నియమించబడిన దివ్య పురుషుడవు గనుక నీకు అనంతకాల స్తోత్రములు.

36. యేసుప్రభువా! నీవు ఈ లోకములో మనుష్య శరీరముతో జన్మించెదవని పాత నిబంధనలో వాగ్దానములు వ్రాయబడియున్నవి. అవి ప్రత్యేక వాగ్ధానములై యున్నవి. ఇది నీ రాకడలో ఒక రాకడయైయున్నది. గనుక నీకు స్తోత్రములు.

37. మా ప్రభువా! నీ జన్మము మానవులలో ఒక ప్రత్యేకమైన జన్మమై యున్నది. ఇది నీ రాకడలో ఒక రాకడయై యున్నది. గనుక నీకు స్తోత్రములు.

38. మరియు నీవు భూలోకములో నడిచిన జీవితము ఒక చరిత్రయై యున్నది. ఇది నీ రాకడలో ఒక రాకడయై యున్నది. గనుక నీకు స్తోత్రములు.

39. ఓ ప్రభువా! నీ మరణము ఎవరికిని లేని ప్రత్యేకమైన మరణమై యున్నది. ఇది నీ రాకడలో ఒక రాకడ గనుక నీకు స్తోత్రము.

40. ప్రభువా! నీ పునరుత్థానము, ఎవ్వరు ఎరుగనటువంటి ప్రత్యేకమైన పునరుత్థానము. ఇది నీ రాకడలో ఒక రాకడ గనుక నీకు స్తోత్రములు.

41. ప్రభువా! నీ ఆరోహణము ఎవరికిని అర్థముకాని ఆరోహణము మాత్రమేకాక, హనోకు యొక్కయు, ఏలియా యొక్కయు ఆరోహణమువంటిది మాత్రమేకాక ప్రత్యేకమైన ఆరోహణము. ఇది నీ రాకడలో ఒక రాకడ గనుక నీకు స్తోత్రములు.

42. యేసు ప్రభువా! నీ రాకడ అందరికిని ఆశ పుట్టించి, ఎదురు చూచుటకు ఇదిగో, అదిగో అన్నట్లుండుటవలన ఇది చిత్రమైన సంఘారోహణము. ఇది పెండ్లి రాకడ. నీవు మేఘాసీనుడవై వచ్చే రాకడ. రాకడయందు సంఘమును ఆకర్షించే రాకడ. నేడు లోకమును గలిబిలి కలిగించే రాకడయై యున్నది. గనుక నీకు వందనములు. అట్టి విచిత్రమైన రాకడకు మమ్మును సిద్ధపరచుము నీకు స్తోత్రములు.

43. భూమి పుట్టినది మొదలుకొని నేటివరకు, నీ భక్తులు నిన్ను పిలుచునప్పుడెల్ల వచ్చుచునేయున్నావు. అవన్నియు లెక్కపెట్టిన అనేకమైన రాకడలగును. అవి ఒక్కొక్కరి దగ్గరకు వచ్చిన రాకడలు గనుక నీకు స్తోత్రములు.

44. ఒక గ్రామమునకు గొప్ప ఉద్యోగులు వచ్చుచున్నారని మునసబుగారు చాటింతురు. ఆయన వచ్చేదారిలో చెత్త మరియు ఇతర అడ్డములు లేకుండ చేయుమనియు, వీధులలోని ఇండ్లకు వెల్లవేసికొమ్మనియు చెప్పుదురు. వీటన్నిటికి ఖర్చులు మునసబుగారు ఇవ్వరు. ప్రజలు తమంతటతటా తామే ఆ ఖర్చు భరింతురు. అలాగే గురుతులు యేసుప్రభువు వచ్చుచున్నాడని చాటించుచున్నవి. గనుక బోధకులు–మీ హృదయములు శుద్ధిచేసికొనండి, తప్పిదములు ఒప్పుకొనండి, సిద్ధపడండి, అని సలహాలు చెప్పుదురు గాని బోధకులు మనుష్యులయొక్క హృదయములలోనికి వెళ్ళి శుభ్రము చేయరు. ఎవరిమట్టుకు వారే సిద్ధపడవలెను. ఎవరిమట్టుకు వారే ప్రార్ధనలు, స్తుతులు చేసికొనవలెను. ఎవరి మట్టుకువారే రాకడ పాఠములు నేర్చుకొనవలెను. ఓ ప్రభువా! మేము స్వయముగా సిద్ధపడుటకు తగిన శక్తి, నీ సహాయము, వీలు దయచేయుము. నీకు స్తోత్రములు.

45. పరలోకములోనున్న పరిశుద్ధులు, దేవదూతలు, వారికి రక్షణ అవసరము లేనప్పటికి రాకడ, రాకడ అని తొందరపడుచున్నారు. అయితే రక్షణ కావలసిన మనము ఇంకా ఎంత తొందరపడవలెను! లోకములోనున్నవారు, నీ రాకడ ఎప్పుడు? అని అడుగుచున్నారు. ఓ ప్రభువా! మా పక్షముగా నీవే వారికి జవాబు చెప్పుము.

46. 'ఓ ప్రభువా! మా పద్ధతి ప్రకారము లోకమునకు రక్షణవార్త, రాకడవార్త అందించినాము. ఇప్పుడు నీ స్వంత పద్ధతి ప్రకారము రక్షణవార్త, రాకడవార్త ఎట్లు చెప్పవలెనో, అట్లు లోకములోని ప్రతిమనిషికి చెప్పుము. నీ పద్ధతి మాకు తెలియదు. అట్లు లోకమునకు నీ రాకడవార్త అందజేయుదువు గనుక నీకు స్తోత్రములు.

47. ఓ స్వతంత్రతగల మానవులారా! ఒక్క నిమిషము మీ పనులు కట్టివేసి నా మాట ఆలకించుడి. దేవుడును, అందరి రక్షకుడును అయిన క్రీస్తు

ప్రభువు, మేఘముమీద వచ్చి, భూమిమీదనున్న భక్తులను ప్రాణముతోనే మోక్షమునకు తీసికొని వెళ్ళును. ఆ భక్తులకు మరణముండదు. ఇప్పటినుండి ప్రార్థించి సిద్ధపడండి.' ఓ ప్రభువా! ఇట్టివార్త లోకమంతటికిని అందించుము.

48. కొన్ని యేండ్ల క్రిందట వైద్యులు కొన్ని మాత్రలు కల్పించినారు. అవి కొనినవారు గదుల మూలలో వాటిని ఉంచగా, ఎలుకలు వాటిని మ్రింగి బయటికి పోయినవి. అప్పుడు వాటి గుండెలలో భయముపుట్టి మరల ఆ గదులలోనికి రాలేదు. అది ఎలుకలను చంపకుండ వెళ్ళగొట్టు పద్ధతి. అలాగే రక్షణవార్త మరియు రాకడ వార్త రేపు మా సన్నిధి కూటమునకు డిక్టేషను (నీ నోటి మాటగా) చెప్పుము. అది తెలుగులో, ఇంగ్లీషులో ప్రచురించి, ఇంగ్లీషువార్త అయిదు ఖండములకు పంపించెదము. అప్పుడు చదువుకొను వారియొక్క గుండెలలో గొప్ప భయము, దడ, ఆందోళన కలుగును. నమ్మనియెడల మతి చాంచల్యము కలుగును. ఇది భయంకరము, గాని రక్షణమార్గము కలుగును. ఇది మేము నీకు విన్నవించుకొను నూతనమైన కడసరి పద్ధతి. దీనివల్ల మనుష్యుల హృదయములలో భూకంపములు కలుగును. అప్పుడు అందరు కెవ్వున కేకవేసి ప్రభువా! రక్షించు, రాకడకు సిద్ధపర్చు అని ప్రాధేయపడుదురు లేదా రక్షణకైనను సిద్ధపడుదురు. ఇట్టి కంపము అందరిలోను కలిగింతువని నమ్మి నిన్ను స్తుతించుచున్నాము.

49. కొందరు నిశ్శబ్దముగా తమయొక్క పనులు చేసికొనుచుండగా, చుట్టుప్రక్కల ఉన్న కొందరు కేకలు వేయుచు, ఫలానావారు వచ్చుచున్నారని అన్నప్పుడు, విన్నవారు కూడ పని మానివేసి చూచుచు ఆలకింతురు గదా! అలాగే లోకస్థులందరు తమ పనులలో మునిగి యుండగా మనము, "క్రీస్తుప్రభువు రెండవసారి శీఘ్రముగా రానైయున్నారు" అని చెప్పవలెను. మన మాటలకు వారిచెవులు గింగురుమనుట వలన మన వర్తమానము వారు ఆలకింతురు. కొందరు నమ్ముదురు, కొందరు నమ్మరు, అయినను పరవాలేదు. ప్రభువా! నీ రాకడవార్త ఆ విధముగా మ్రోగించుము.

50. ప్రభువా! నరమాంస భక్షకులకు రక్షణవార్త, రాకడవార్త ఏలాగు అందును? ఎవరైన వెళ్ళిన యెడల వారిని పట్టుకొని, చీల్చి తినివేయుదురు. అట్టివారు అస్సాములోను, నాగాకొండలలోను, ఆఫ్రికాలోని అరణ్యములోను ఉన్నారు. వారిలో కొందరు దిగంబరులు, కొందరు కోతులవలె మారియున్నారు. వారికి తెలివిలేదు. వారికి రక్షణవార్త, రాకడవార్త ఏలాగు అందగలదు? వారికి సువార్త చెప్పుటకు కొందరు మిషనెరీలు వెళ్ళిరి. వారినికూడ వీరు తినివేసినారు. వారు వేసికొన్న కోటులనుకూడ తినివేసిరి. వారికి ఈ సువార్త ఎలాగు వినిపించగలము? **జవాబు:** వారికి రక్షణ సువార్త వినిపించుటకు మొట్టమొదట కైలాస ఋషిగారు వెళ్ళి, వినిపించవలెను. తరువాత సన్నిధి కూటస్థులలో కొందరు వారికి రాకడ సువార్త అందించవలెను. ప్రభువా! నీవు మా యెడల ఏమిచేసిన ఆ పనికి మేము సిద్ధపడగలమో, ఆ పని మా యందు నెరవేర్చి మమ్మును సిద్ధపర్చుము.

51. అవిధేయుడైన బిలామునకు గార్ధభముచేత మనుష్య వాక్కుతో వర్తమానము చెప్పించినావు. ప్రభువా! ఇప్పుడు నిన్ను నమ్మిన అన్యులు, నీ రాకడ నమ్మని క్రైస్తవులు, నామక క్రైస్తవులు ఉన్నారు. వారికి, వారి స్వంత పశువులచేత సువార్త చెప్పించ కూడదా? అట్లు చెప్పించుట నీ కార్యక్రమమునకు విరుద్ధమా? ప్రభువా! ఏరీతినైనను నీ రాకడ వార్త వారికి చెప్పించుమని వేడుకొనుచున్నాము.

52. ప్రభువా! నీవు 5 వేలమందికి ఆహారము కల్పించి పెట్టినావుకదా! ఇప్పుడు కూడా అనేక వేలమంది బీదలకు ఆహారము పెట్టిన యెడల వారికి సువార్త చెప్పవచ్చును గదా! ఇది బైబిలు చరిత్రకు సంబంధించిన ప్రార్థన.

53. యేసు ప్రభువా! లోకములో ఏ పత్రికాధిపతి వలననైనను, ఏ గ్రంథకర్తచేతనైనను ఈ క్రింద చెప్పబడిన పత్రిక వ్రాయించుము. మొదటి గదిలో రాకడకు ముందు జరగవలసిన గురుతులను, రెండవ గదిలో ఆ గురుతులయొక్క వచనములు బైబిలులో ఎక్కడ నున్నదియును, మూడవ గదిలో ఏఏ తేదిలలో ఆ గురుతులు నెరవేరినవియును, నాలుగవ గదిలో ఇంకను నెరవేరవలసిన గురుతులు

ఉన్నయెడల అవియును, అయిదవ గదిలో బైబిలులో లేకపోయినను రాకడను సూచించు గురుతులును, ఆరవ గదిలో అవి నెరవేరిన తేదీలును, ఏడవ గదిలో పై రెండు గురుతులు నెరవేరిన స్థలములును వ్రాయించుము లేదా సన్నిధి కూటములలో నీవైనా చెప్పుము. అప్పుడు ఆ సంగతులను ప్రచురణ చేయుదుము. ఈ మా ప్రార్థన నెరవేర్చుము.

54. యేసు ప్రభువా! నీవు త్వరగా వచ్చెదవని చెప్పి ఇంత ఆలస్యముగా వచ్చుచున్నావు. ఈ ఆలస్యము యొక్క అర్థము మేము ఇతరులకు ఎట్లు చెప్పవలెనో మాకు నేర్పుము.

55. దేవుని దృష్టిలో, విశ్వాసియొక్క ఆత్మలోకూడ గురుతులు అయిన తర్వాత త్వరగా వచ్చును. 'త్వరగా' అని చెప్పియున్నాడు గనుక త్వరగా వచ్చుచున్నాడని నమ్ముటయే విశ్వాసియొక్క గురుతు. ఒకరికి పరిష్కారము కానప్పుడు నలుగురుకూడుకొని మన భావమేమి అని చెప్పుకొనవచ్చును, కాని విసుగు కొనరాదు. ప్రభువా! నీవు త్వరగా వచ్చుచున్నావు కాబట్టి మమ్మును త్వరగా సిద్ధపర్చుము.

56. ప్రభువా! అన్ని జనాంగములనుండి నీ రాకడకు మనుష్యులను సిద్ధపరచుకొనుము. అన్ని భాషలలో నున్నవారిని నీ రాకడకు సిద్ధపర్చుము. అన్ని స్థితులలో నున్నవారిని అనగా పాప స్థితిలో, వ్యాధి స్థితిలో, బీద స్థితిలో, అవస్థల స్థితిలో, నిరాశ స్థితిలో, మరణ స్థితిలో ఉన్నవారిని నీ రాకడకు సిద్ధపర్చుకొనుము. నీ వాక్యము విన్నవారిని, వినియు నమ్మనివారిని, నమ్మియు తప్పిపోయిన వారిని నీ రాకడకు సిద్ధపరచుము. నరమాంస భక్షకులలో కొందరినైనను నీ రాకడకు సిద్ధపరచుము. భూలోకములో నున్నవారిలో కొందరు, రక్షణ గల మరణమునకు సిద్ధపడగలరు, కొందరు భక్తులైనప్పటికిని రాకడకు సిద్ధపడ లేరు గనుక సిద్ధపడుట ఎవరికి ఇష్టమో వారిని సిద్ధపర్చుము. దేవా! చిన్నపిల్లలను దీవించుము. వారు నిన్ను అవమానపరచు ఏ పాపమును చేయలేదు గనుక వారిని గూడ నీ రాకడలో తీసికొని వెళ్ళుము. ఇట్టి మా ప్రార్థన ఆలకించినందులకు నీకు వందనములు.

57. సొదొమ పట్టణము నాశనమప్పుడు,దేవదూతలు బలవంతముగా కొందరిని రక్షించి అగ్నిపాలు కాకుండచేసిరి. అబ్రాహాము ప్రార్ధనచేసెను గాని నెరవేరలేదు, అయినను నిరాశపడలేదు. రాకడకు సిద్ధపడువారుకూడ తమ ప్రార్ధనలు కొన్ని నెరవేరనప్పుడు నిరాశపడరాదు. ప్రభువా! అట్టి సమయములో నిరాశపడకుండ మమ్మును కాపాడుదువని నమ్మి నిన్ను స్తుతించుచున్నాము.

58. ఒక గ్రామములో ఇంటి యజమానుడు తన కుమారునికి వివాహము ఏర్పరచును. మరియొక గ్రామములో ఇంకొకరు తన కుమార్తెకు పెండ్లి ఏర్పాటు చేయును గాని పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తె మన దేశములో మాట్లాడుకొనరు. అయితే మానవులు పాప లోకములో పుట్టిరి గనుకను ప్రభువు తన స్వరక్తముతో శుద్ధిచేసెను గనుకను, ప్రభువు పెండ్లి సంఘముతో గదిలో (సన్నిధిలో) మాటలాడును. సంఘము అను పెండ్లికుమార్తెయు, వరుడైన ప్రభువును మాటలాడు కొనుచున్నారు. ఇట్టి చనువు సంఘమునకిచ్చిన ప్రభువా! నీకు స్తోత్రములు.

59. దయగల యేసుప్రభువా! నీవు మా సన్నిధి కూటములోనికి వచ్చి, రాకడ వర్తమానములు ఇచ్చుచున్నందుకు వందనములు. మాకు తెలియజేయుచున్న రాకడ వర్తమానములు లోకములోనున్న ప్రతివారికి తెలియజేయుము. మాకు వర్తమానము తెలియజేసినప్పుడు ఎలాగు వ్రాసికొనుచున్నామో, అలాగే వారికిని తెలియజేసి వ్రాసికొనునట్లు చేయుము. మాకు ప్రతిదినము తెలియజేయుచున్నట్లు, నమ్మినను నమ్మకపోయినను వారికికూడ తెలియజేయుము. నీ మాటలు నమ్మినను, నమ్మకపోయినను నీవు వెళ్ళి చెప్పుము అని యెహెజ్కేలు ప్రవక్తతో చెప్పినావు గదా! (యెహెజ్కేలు 2:4) మా పత్రికలలో మేము చెప్పుచున్నాము గాని అది చాలదు. మేము స్వయముగా చెప్పినను చాలదు. నీవు చెప్పిన సరిపోవును. వారి హృదయమునకు, జ్ఞానమునకు అందును. అధమపక్షము వారి జ్ఞానమునకైనను అందునట్లు చెప్పుదువని నిన్ను వందించుచున్నాము.

60. మాకు పట్టుదల లేదనియు, నీవు జవాబు చెప్పువరకు మేము కనిపెట్టుటలేదనియు నీవు దర్శనములో చెప్పినావు. ఆ మాట నిజము. మేము పట్టుదల, ఓపికతో కనిపెట్టు శక్తి దయచేయుము. నీకు లెక్కకు మించిన వందనములు.

61. దేవుడు అబ్రాహాముతో నేను చూపించు దేశమునకు వెళ్ళుమని చెప్పినప్పుడు 'ఎట్లు పోవలెను' అని అడుగలేదు. మరియు దేవుడు అబ్రాహామునకు కుమారుని ఇచ్చెదనని వాగ్ధానము చేసెను. అబ్రాహాము ఏలాగు ఇస్తావు? ఎప్పుడు ఇస్తావు? అని ప్రశ్నించలేదు. దేవునిమాట నమ్మి ఊరకుండెను. కుమారుడు ఆలస్యముగా జన్మించినను విశ్వాసము చెడలేదు. శారా నమ్మలేదు గాని నవ్వినందుకు ప్రభువు కోపపడెను. అబ్రాహాము కూడ నవ్వినాడుగాని దేవునికి అసాధ్యమైనది లేదని నమస్కరించి నమ్మెను. అబ్రాహాము కుమారుడైన ఇస్సాకుకు ముంగుర్తుగానున్న, యేసు ప్రభువుయొక్క రెండవ రాకడను గురించి రెండువేల సం॥ముల నుండి కనిపెట్టుచున్నాము. మనము ప్రార్థించి, నమ్మి, విసుగుకొనక సిద్ధపడవలెను. రాకడకు సిద్ధపడుటలో అబ్రాహాముయొక్క విశ్వాసము దయచేయుదువని నమ్మి నీకు నమస్కారములు చెల్లించుచున్నాము.

62. ఇస్సాకు అను పెండ్లికుమారుడు, రిబ్కా అను పెండ్లి కుమార్తెయున్న ఊరువెళ్ళలేదు. ఎలీయెజెరు అను అబ్రాహాము యొక్క సేవకుడు, పెండ్లికుమార్తెను తీసికొని వచ్చెను. పెండ్లికుమార్తె ఊరికిని, పెండ్లికుమారుని ఊరికిని చాలాదూరము. అలాగే మేఘములపైన పరలోకములోనున్న నీతి సూర్యుడైన యేసు ప్రభువునకును, భూమి మీదనున్న సంఘమునకును చాలాదూరము. ఎలీయెజెరు పరిశుద్ధాత్మకు ముంగుర్తు. ఎలీయెజెరు రిబ్కాను తయారు చేసినట్లు, ఇప్పుడు పరిశుద్ధాత్మ సంఘమును తయారు చేయుచుండెను. ఎలియాజరు రిబ్కాకు నగలు ఇచ్చినట్లు, పరిశుద్ధాత్మ సంఘమునకు 'వరములు' అనే నగలు ఇచ్చి తయారుచేయుచు అలంకరించుచున్నారు. ఇప్పుడు ఆ పని జరుగుచున్నది. మనము రాకడ సంఘములోనున్న యెడల మనలను పరిశుద్ధాత్మ తయారు చేయును. రిబ్కా తనంతట తాను తయారు కాలేనట్లు, మనంతట మనమును పెండ్లికుమార్తెగా తయారు కాలేము. ఎలీయెజెరు బాటసారి అనుకొని రిబ్కా నీరు పోసెను. ఓ ప్రభువా! ఎలీయెజెరు, రిబ్కా అను పెండ్లికుమార్తెను తయారుచేసి ఇస్సాకు నొద్దకు తీసికొని వెళ్లినట్లు, పరిశుద్ధాత్మ భూమిమీదనున్న సంఘము అను పెండ్లి కుమార్తెను సిద్ధముచేసి మేఘములోనున్న నీయొద్దకు తీసికొనివచ్చును. ఆ సంఘములో మేముకూడ ఉండునట్లు నీ కృప దయచేయుము. 'ఎలీయెజెరుతో వెళ్ళుదువా' అని రిబ్కాను

తనవారు అడిగినప్పుడు ఆమె 'వెళ్ళెద' నని జవాబు చెప్పెను. ఆలోచించి చెప్పుదుననలేదు, చాటునకు పోలేదు, సిగ్గు పడలేదు, తల వంచుకొనలేదు గాని వెళ్ళడానికే నిశ్చయించుకొన్నది. ఎలీయెజెరుతో వెళ్లుటకు (రెడీ) సిద్ధము, నగలు ధరించుకొనుటకు (రెడీ) సిద్ధము, నీళ్ళు పోయుమనగా తన ఒంటెలకు కూడ పోయుటకు (రెడీ) సిద్ధము, ఇల్లు చూపించెదవా అనగా బస, భోజనము కూడ (రెడీ) సిద్ధము అని చెప్పెను. ఇంటిదగ్గర ఎవరిని అడుగకముందే అన్నీ సిద్ధము అని చెప్పెను. అలాగే సంఘము అను పెండ్లికుమార్తె, రిబ్కావలె ప్రభువు విషయము లన్నిటిలోను సిద్ధముగానుండి, (రెడీ) సిద్ధము ప్రభువా! అని చెప్పవలెను. అట్లు మేము అన్ని విషయములలో సిద్ధముగానుండే కృప దయచేయుదువని నమ్మి నీకు మంగళ స్తోత్రములర్పించు చున్నాము.

63. 1) యేసు ప్రభువా! ఇతర మతస్తులు కొందరు ఇట్లనుచున్నారు. పోతులూరి వీరబ్రహ్మముగారి శిష్యుడు 'వసంతరాయుడు' మిక్కిలి త్వరలో రానైయున్నాడు. వసంతము ఎఱ్ఱగా నుండును, గనుక అది రక్తమునకు గుర్తు అట. మరియు "రాయుడు" అనగా ప్రభువట. అనగా రక్తము చిందించిన యేసు ప్రభువు త్వరగా వస్తాడని పోతులూరి వీరబ్రహ్మంగారి అభిప్రాయమట. ప్రభువా! దీని భావమేమిటో తెలియజేయుము. 2) ఆయన వచ్చి పదివేల సంవత్సరములు శాంతిరాజ్యము ఏలును అని హిందువులు నమ్ముచున్నారు. దీని విషయము మాకేమి తెలియజేయుదువు? 3) ఎవరో ఒక గొప్ప వ్యక్తి భూమి మీదకి వచ్చునని మహ్మదీయులు చెప్పుచున్నారు. ఆయన ఎవరైనది ప్రభువా! తెలియపర్చుము. 4) మరియు లోకమంతటిని మార్చుటకు ఎవరో ఒకరు వచ్చెదరనియు, ఆయన వచ్చినగాని ఎవరో తెలియదనియు, (క్రీస్తు ప్రభువు లేక మహమ్మదు లేక చింద్వాడు లేక రాయుడు) వచ్చిన తరువాత గానీ పోలికనుబట్టి తెలియుననియు దివ్యజ్ఞానులు చెప్పుచున్నారు. ఇంకా కొందరు ఏమనుచున్నారు. 'రోడ్డు'అని ఒకభాషవారు, తెలుగువారు 'బాట' అని, మహ్మదీయులు 'రాస్తా' అని అంటారుగాని అన్ని ఒక్కటే గదా! అలాగే ఎవరు ఏది అనుకొనినా, వచ్చుచున్న ఆయన దేవుడు అనుచున్నారు. ప్రభువా! నీవు వచ్చుచున్నావని మాకు తెలిసినది గనుక వారికి కూడ తెలియపర్చుము.

64. యేసు ప్రభువా! నీ మొదటి రాకడకు పాత నిబంధన భక్తులు ఎంత ఆశతో కనిపెట్టినారో, అలాగే క్రొత్త నిబంధనవారమైన మేము నీ రెండవ రాకడకు అంత ఆశతో కనిపెట్టునట్లు మమ్మును ప్రేరేపించుము.

65. **ఆహ్వాన పత్రిక:** భూలోకములో పెండ్లి సమయములో, ఆహ్వాన కార్డులు అచ్చువేసి పంపించెదరు. రాకడ తర్వాత పరలోకములో పెండ్లివిందు జరుగును. ఆ విందులో పెండ్లికుమార్తె కూర్చుని యుండును. ఈ పెండ్లికుమార్తె సువార్తవలన, ప్రార్థనల వలన మారుమనస్సు పొంది, మోక్షములోనున్న వారిని ఆ విందుకు పిలిచెదరు. గనుక ఇపుడే మనము అందరికి సువార్త వినిపించవలెను. ఈ లోకములో సువార్త ప్రకటించుటే పెండ్లికార్డు అందించుట. గనుక సువార్త పని నిర్లక్ష్య పెట్టకూడదు. ఇట్టి ఆహ్వాన పత్రిక విషయములో శ్రద్ధ వహించవలెను. అట్టి శ్రద్ధ మాలో పుట్టించెదవని నిన్ను స్తుతించుచున్నాము.

66. ప్రభువా! మాకు భూలోకములో రక్షణ విందు అనుభవించు భాగ్యము దయచేసినావు వందనములు. అలాగే రాకడ విందు అనుభవించు భాగ్యము దయచేయుము. వివాహము కాకముందు పెండ్లి కుమార్తె తన గృహమందు విందు చేయునుగదా! అదే భూలోకములోని రక్షణ విందు. రాకడ అయిన తర్వాత ఏడేండ్లలో అసలు విందు జరుగును. మేము ఈ విందులో పాల్గొను కృప దయచేయుదువు గనుక నీకే స్తోత్రములు.

67. దేవుడు భూలోకములో నున్నవారిని ఎవరిని విడిచిపెట్టడు. అందరికీ సువార్త వినిపించనిదే అంత్యతీర్పు రానివ్వడు. హేడెస్సులోనున్న వారికికూడ బోధించవలెను. రాకడ తర్వాత పరలోకములోనున్న రక్షితులను ప్రభువు విందుకు పిలుచును. అనగా రక్షణ కలిగినవారికి ప్రభువు ఇచ్చు అంతస్థు, పెండ్లికుమార్తె యొక్క విందుకు రానిచ్చుట. వీరు విందును చూచుటకు మాత్రమే కాక విందు అనుభవించుటకు కూడ పిలువబడుదురు. పెండ్లికుమార్తె తన సువార్త వలన రక్షింపబడిన వారిని విందుకు ఆహ్వానించవలసినదిగా ప్రభువును కోరుకొనును. ఆ సమయమున భూలోకములో 7 ఏండ్ల శ్రమలలో అవిశ్వాసులు బాధపడుచుందురు.

పరలోకములో పెండ్లికుమార్తె, రక్షితులు విందులో నుందురు. అందువలన అవిశ్వాసులకు, సాతానుకు సిగ్గు. అంతేకాదు పరాభవము, అపజయము వచ్చినదని గోల పెట్టుదురు. రక్షితులైన వారు, పెండ్లి విందుకు వెళ్లు హక్కు చూచి మరింత సిగ్గు పడుదురు. ఈ విందు సమయములో పెండ్లికుమార్తె మహిమ, వెలుగు, కాంతి రక్షితులు చూడలేరు గనుక పెండ్లికుమార్తె తన ముఖముపై ముసుగు వేసికొనును. ప్రభువా! ఇట్టి మహిమగల విందులో నుండుటకు మమ్మును తయారుచేయుదువని నమ్మి నీకు హారతులొసగు చున్నాము.

68. ఏనుగు నీడ పెద్దది, సూదినీడ చిన్నది. రెండును నీడలే గనుక ఎట్టి బలహీనత మనలో ఉన్నను అది చీకటియై యున్నది. తండ్రీ! ఏ విధమైన చీకటి లేకుండ మమ్మును క్రమపర్చుము. మేము ఈ భూలోకములో పొందవలసిన మహిమ పొందగలుగునట్లు క్రమపర్చుము. పరలోకములో అందరికన్న ఎక్కువ మహిమ నూతన యెరూషలేము వాస్తవ్యులకు ఉన్నది. గనుక మాలో ప్రతివారిని ఆ మహిమ, జీవితమునకు సిద్ధపర్చుము. ఇట్టి స్థితికి అన్నీ అడ్డులే. వ్యాధి మొదలగు అడ్డులు గలవు. అయినను ఇట్టి అడ్డులన్నియు తొలగించుకొని ఆ మహిమకు సిద్ధపడు భాగ్యము అనుగ్రహించుము. మా తప్పులు, పొరపాట్లు దిద్దుకొనుటకు ప్రయాసపడునట్టి కృప, దయ మాకనుగ్రహించుము. నీవు అందుకు కావలసిన గడువులు, సాధనములు ఇచ్చుచున్నావు. మేము సంపూర్తిగా ఈ నిమిషమందు మారునట్టి కృప దయచేయుము. మేమట్లు మారుట కష్టము కాదు. ఎందుకనగా నీ వాక్యములో ఒక మాట వ్రాయించినావు. అదేదనగా 'నీ యాజ్ఞలు భారమైనవి కావు' (1 యోహాను 5:3) గనుక మేము నిన్ను బట్టి నెరవేర్చగలము గనుక నీకు స్తోత్రము. యోహానువలె నీ ఆజ్ఞలు భారమైనవి కావని మేము చెప్పగల భాగ్యము అనుగ్రహించుము. ఈ నిమిషములోనే మేము సంపూర్ణ స్థితికి రాగల కృప దయచేయుము. మేము 'తర్వాత' అని జరుపుకొనక 'త్వరగా' సిద్ధపడు భాగ్యము అనుగ్రహింపుము. నీ వాక్యము నీ సృష్టి, మేము గుణపడునట్లు మాకు బోధించుచున్నవి గనుక నీకు స్తోత్రము. మేము మొదట మారి, తరువాత ఇతరులు మారుటకు మార్గమును చూపునట్లు, మమ్మును

మాదిరి జీవితముగలవారినిగా మార్చుము. మా జీవితము నూతన యెరూషలేమునకు తగు జీవితముగా క్రమ పరచుము. మేము అన్ని విషయములలోను మంద భాగ్యులమైయున్న యెడల ఏలాగు నూతన యెరూషలేము చేరగలము? కొందరు ఎంత విన్నను ఫలితము కనబడదు, వారు మార్పు చెందరు. కొందరు త్వరగా మారి పోవుదురు. సిలువ దగ్గర ఒకరు మారినారు, ఇంకొకరు మారలేదు. పెండ్లి కుమార్తె వరుసలోని వారు కూడ మందస్థితిలో నున్నారు. గనుక మెళుకువ స్థితిగలిగి జాగ్రత్తపడు కృప దయచేయుము.

69. ఓ తండ్రీ! పదియాజ్ఞలనుబట్టి మా హృదయమును శుద్ధిచేసికొనుట నేర్చుకొన్నాము. గాని మా జ్ఞానమునకు తోడుగాను, మా మనస్సాక్షికి తోడుగాను, నీ రాకడకు ఎట్లు సిద్ధపడవలసినది నీ ఆత్మ చేత కూడ నేర్పించుమని వేడుకొనుచున్నాము.

70. నీ వాక్యమంతయు చదివి, మమ్ము నేలాగు శుద్ధీకరించుకొన వలసినది కొంతవరకు నేర్చుకొన్నాము. ఈ వాక్య జ్ఞానమునకు తోడుగా మాకు నీ పరిశుద్ధాత్మ సహాయమునిచ్చి, మా జ్ఞానమును వెలిగించి, నీ రాకడకు ఎట్లు సిద్ధపడవలసినది నేర్పించుమని వేడుకొనుచున్నాము.

71. ఇతరులకు సువార్త ప్రకటించుట వలన మా ఆత్మీయ జీవనమునకు బలము కలిగించు సాధనము దొరకునని గ్రహించినాము. అయితే ముఖ్యముగా నీ రాకడను బోధించు సేవవలన కూడ, నీ రాకడకు మేమెట్లు సిద్ధపడవలెనో నీ యాత్మచేత నేర్పించుమని వేడుకొనుచున్నాము.

72. ప్రార్థన చేయుటవలన అనగా మా పాపములు ఒప్పుకొనుట వలనను, మాకు కావలసినవి ఇమ్మని నిన్ను వేడుకొనుట వలనను, పూర్తిగా మేము నీకు సమర్పణ అగుటవలనను, నిన్ను స్తుతించుట వలనను, మేము మంచిస్థితిలోనికి తయారు కాగలము. వీటికి తోడు నీయాత్మ సహాయము కూడ దయచేసి, మమ్మును నీ రాకడకు సిద్ధపరచుమని వేడుకొనుచున్నాము.

73. మేము ఏమి చేసిన రక్షణ స్థితిలోనికి రాగలమో, ఏమిచేసిన రక్షణ నిలుపుకొనగలమో, ఏమి చేసిన ఆత్మీయ జీవనమును నిలుపుకొనగలమో,

అన్నీ మేము చేయుటకు ప్రయత్నించు చున్నాము. మేము రాకడకు సిద్ధపడుటకు, ఇవన్ని మాకు సహాయకరముగ నుండునట్లు నీ పరిశుద్ధాత్మ వలన మమ్మును నడిపించుమని వేడుకొనుచున్నాము.

74. మేము ప్రత్యేక కూటములు పెట్టుకొని రాకడను గూర్చియు, రాకడకు సంబంధించిన విషయములను గూర్చియు నేర్చుకొనుచున్నాము. గాని నీ యాత్మ సహాయము ప్రతి విషయములోను మాకు అవసరము. మా స్వంత జ్ఞాన ప్రయత్నము, మా విశ్వాస ప్రయత్నము చాలదు గనుక ప్రత్యేకమైన రీతిని నీ యాత్మ సహాయము కోరుకొనుచున్నాము. గనుక ఏమేమి చేసినయెడల నీ రాకడకు సిద్ధపడగలమో అట్టివి మాచేత చేయించుమని వేడుకొనుచున్నాము.

75. ఏయే గురుతుల వలన మేము నీ రాకడ సమీపమని తెలిసికొనగలమో, ఆయా గురుతులు మాకు బైబిలులోను, లోక చరిత్రలోను, సంఘములోను, సృష్టిలోను చూపించి, వాటివలన నీ రాకడ సమీపమని మేము గ్రహించి, సిద్ధపడుటకు నీయాత్మ సహాయము దయచేయుము. ప్రతిచిన్న విషయములోను నీ యాత్మ సహాయము ఎంతో అవసరము. గనుక నీ యాత్మ సహాయము మాకు దయచేసి, నీ రాకడకు ఆయత్తపరచుమని వేడుకొనుచున్నాము.

76. వీటిద్వారానే కాకుండా, ఇంకా వేటిద్వారా నీ రాకడ సమీపమని మాకు తెలియజేయుట నీ చిత్తమో, అట్టివి కూడ మాకు తెలియజేయుము. మేము అంగీకరింతుము. పూర్వకాలమందు విశ్వాసులకు నీవు దర్శనములో కనబడి, చెప్పవలసిన సంగతులు చెప్పియున్నావు. అది నీ చిత్తమైయున్నది. ఈ కాలములో కూడ మాలో ఎవ్వరికైనను దర్శనములో కనబడి, చెప్పవలసిన సంగతులు చెప్పుమని వేడుకొనుచున్నాము. అట్టి సమయములో నీయాత్మ యొక్క సహాయము మాకు ఎక్కువ అవసరము. ఎందుకనగా పిశాచి వలనను, కొందరి స్వంత ఊహల వలనను, తప్పుడు దర్శనములుకూడ రావచ్చును, వీటికి మేము భయపడకూడదు. ఎందుకనగా ఎవరు నీకు సమర్పణ అయినారో, ఎవరు నీ చిత్తప్రకారము చేయ నిశ్చయించుకొందురో వారికి తప్పుడు దర్శనములు రావు. నీ కృప మాకు దయచేసి మమ్మును కనికరించుమని వేడుకొనుచున్నాము.

77. రాబోవు ఉగ్రతను తప్పించుకొనుటలో, లోతు ఆలస్యముచేయుట నీవు కనిపెట్టి, అయ్యో! త్వరపడలేక పోవుచున్నాడు గదా అని నీవు కనికరించి, ఆయన చేతులు పట్టుకొని నడిపించుకొని వెళ్ళినావు. ఇది ఎంత అద్భుతకరమైన కృప! అలాగుననే మాకు తెలిసిన ఏడేండ్ల శ్రమ తప్పించుకొనగోరు మేము, నీ రాకడకు త్వరపడు విషయములో జాగుచేయుట నీకు తెలియును. గనుక మా మీద నీ కనికరముంచుమని వేడుకొను చున్నాము.

78. ఓ తండ్రీ! జీవాంతమందు ఎవరు ఎక్కడికి వెళ్లునది, నీకు ముందుగా తెలియును. కొందరు నూతన యెరూషలేమునకు సజీవుల గుంపులో వెళ్లుదురు. కొందరు మృతుల గుంపులో నూతన యెరూషలేము చేరుదురు. కొందరు ఏడేండ్ల శ్రమలలో సిద్ధపడుదురు. కొందరు వెయ్యేండ్లలో తయారగుదురు. రక్షింపబడిన వారిలో కొందరు పరలోకములో నుందురు. కొందరు రక్షింపబడి, మారిపోయిన భూలోక మోక్షములో నుందురు. ఈ గుంపులన్నియు గలవని నీ వాక్యమువలననే నేర్చుకొన్నాము. గనుక నేను ఏ గుంపులోనికి చేరవలయునో, ఆ గుంపులోనికి తయారుకాగల కృప దయచేయుము. నేను వేరే గుంపులో చేరవలెనని ప్రయత్నము చేసినా అది నా గుంపు కాదు గనుక నెరవేరదు. గనుక నాది ఏ గుంపు అయిన, అందులోనే చేరగల కృప దయచేయుము. మరియు ఓ ప్రభువా! ఫలాని గుంపులో చేరుమని నా మనస్సాక్షి చెప్పినది నిరుకుకాదు. నన్ను గురించి ఇతరులకు వచ్చు దర్శనములనుబట్టి కూడ నిరుకు కాదు. నా స్వపరీక్ష చెప్పునదికూడ నిరుకు కాదు గానీ నీకు ఏది తెలియునో అదే ఖాయము నీవు నాకు ఏది చెప్పుదువో అదే ఖాయము. ఈ కాలములో కొందరికి దర్శనములో కనబడి, వారికి చెప్పవలసినవి చెప్పుచున్నావని వింటున్నాము గనుక నాకుకూడ కనబడి చెప్పుము. ఆ విధముగా చెప్పుటకు నీకిష్టమయిన యెడల చెప్పుము. నీ కిష్టము కాకపోయిన యెడల నాకు చెప్పకుము, గాని నేను సజీవుల గుంపులో నూతన యెరూషలేములో చేరుటకు అవసరమైన ముఖ్యమైన పనులును, ప్రార్థనలును చేయుదును. అడ్డములు వచ్చినను, శ్రమలు వచ్చినను, నేను వీటిని ఎక్కువగా చేయుదును గనుక దీవించుము. నేను ఒకరి ప్రార్థన మీద ఆనుకొనను గాని ఆత్మ అందింపును బట్టి ప్రార్థన చేయుదును.

**షరా:** జ్ఞానముతో అనగా మనస్సుతోను, స్వంత ఆత్మతోను ఏమిచేసినను చేయవచ్చును గాని స్వంత ఆత్మ పరిశుద్ధాత్మ వలన వెలిగింపబడవలెను. అందుకే మనో నిదానము అవసరము.

79. సజీవుల గుంపులో నుండు వారికి ఉండవలసిన లక్షణములు. 1) బైబిలు చదువుట 2) ప్రార్థన చేయుట 3) స్తుతులు చేయుట 4) సువార్త అందించుట 5) ప్రవర్తన సరిజూచుకొనుట 6) శ్రమ సహించుట 7) చందా ఇచ్చుట 8) జ్ఞానమును సరియైన రీతిగా వాడుకొనుట.

**80. పరీక్షాంశములు**

1) బైబిలు చదువుచున్నావా? ఆ గురితో
2) ప్రార్థన చేయుచున్నావా? ”
3) స్తుతులు చేయుచున్నావా? ”
4) సువార్తపని చేయుచున్నావా? ”
5) చందా వేయుచున్నావా? ”
6) శ్రమ అనుభవించు చున్నావా? ”
7) ప్రవర్తన సరిపోయినదా? ”
8) జ్ఞానము సరిపోయినదా? ”

‘ఆ గురితో’ అనగా రాకడకు సిద్ధపడు గురితో పై పనులన్నియు చేయుచున్నావా?

**81. శుద్ధి ప్రార్థన:** మహాపరిశుద్ధుడవైన ఓ తండ్రీ! నేను ఈ లోకములో ఎంతకాలము జీవించవలెనో అంతకాలము నీ దృష్టిలో పవిత్రముగా జీవించుటకు, నీ వాక్యములోనున్న ఆజ్ఞలనుబట్టి నా హృదయమును శుద్ధిచేసికొనుట ఎంత అవసరమో, నేను నీ యొద్దకు వచ్చుటకు నా జీవితమంతటిని శుద్ధిచేసికొనుట అంత అవసరము గనుక ఈ శుద్ధి కార్య విషయములో నీ పరిశుద్ధాత్మ సహాయము అనుగ్రహించుమని నిన్ను వేడుకొనుచున్నాము. ఈ లోకమునకు సరిపోవు శుద్ధికాదు గాని ఈ లోకమునుండి మహిమ మేఘము మీదికి వెళ్ళుటకు అవసరమైన శుద్ధి కావలెను.

షరా: ఈ శుద్ధి ప్రార్థనయొక్క ప్రతి అంశములోను ప్రార్థన మరియు స్తుతి, రెండును ఉండవలెను. మరియు ప్రార్థనచేయునపుడు పరిశుద్ధాత్మ పేరు ఎత్తి, పరిశుద్ధాత్మ సహాయము దయచేయుమని అడుగవలెను. లోకజీవనశుద్ధి కొరకు పది ఆజ్ఞలు ఉపయోగపడును. రాకడకు సిద్ధపడు శుద్ధి, రాకడకు సిద్ధపడవలసిన వాక్యములనుబట్టి కావలెను.

## ప్రార్థన

1. లోపములను తెలిసికొనుట: పది ఆజ్ఞలనుబట్టి మరియు
2. రాకడ వాక్యములను జ్ఞాపకము చేసికొనుటనుబట్టి
3. ఎవరు శుద్ధిచేయుట : పరిశుద్ధాత్మ తండ్రి
4. దేనితో శుద్ధి : క్రీస్తు రక్తముతో

## స్తుతి

1. విశ్వాసముతో తండ్రి క్షమించినాడని స్తుతిచేయుట
2. ఆ వాక్యములు మనయెడల నెరవేరినవని స్తుతించుట
3. పరిశుద్ధాత్మ తండ్రికి స్తుతి
4. రాకడలో ఎత్తబడుదును ఆనందము, నమ్మకము పరిశుద్ధాత్మ తండ్రివలననే కలుగును. గనుక ఆత్మ తండ్రిని స్తుతించవలెను.

82. పరిశుద్ధాత్మ బాప్తిస్మము పొందినాము గనుక రాకడలో ఎత్తబడుదుమను సంతోషముండును. అయితే జాగ్రత్తగా నుండవలెను, లేకపోయిన స్థితి తగ్గిపోవును. ఉదా: చీకటిలో వెళ్ళుచున్న కుర్రవానితో పెద్దవారు లైటు ఉన్నను జాగ్రత్తగా నడువుమని అందురు. అంతేకాదు, గాలివల్ల లాంతరు ఆరిపోవచ్చును గనుక లాంతరు ఉన్నను అది ఆరిపోకుండ నుండవలెను. మహా పరిశుద్ధుడవైన ఓ తండ్రీ! నేను ఎత్తబడు వారిలోనుండు నిమిత్తము చేసిన ఈ శుద్ధి ప్రార్థన నీవు ఆలకించినావని నమ్ముచున్నాను, ఆనందించుచున్నాను. అన్ని మేళ్ళకంటే గొప్ప మేలైన ఈ మేలు నిమిత్తమై కృతజ్ఞతతో స్తుతించుచున్నాను. ఈ స్తుతి వలన కలిగే ఆనంద దీపము ఆరిపోకుండ చేయుదువని నేను నమ్ముచున్నాను. ఈ గొప్ప కార్యము నాలో పరిశుద్ధాత్మ వలన రాకడవరకు నిలుచుననియు, జరుగుననియు నిరీక్షించుచున్నాను.

## పెండ్లికుమార్తె

పరలోకములో గొఱ్ఱెపిల్లయొక్క వివాహము జరుగును. ఆ వివాహమునకు సంఘము పెండ్లికుమార్తెగా కూర్చుండును. ఈ సంఘమునకు క్రీస్తుప్రభువు వరుసకు పెండ్లికుమారుడగును లేక గొఱ్ఱెపిల్లయగును. ఎలాగనిన, యేసుప్రభువు గొఱ్ఱెపిల్లగా సిలువమీద దహన బలియై, తన స్వంత రక్తమును ధారపోసి, దానితో సంఘమును ఆస్తిగా కొనియున్నాడు. గనుక సంఘము పెండ్లికుమార్తెయైనది. అది ఇప్పుడు మనము ఆలోచించు అంశమై యుండవలెను. యూదులు ఒక్కరే సంఘమైయుండలేదు గాని యూదులు, అన్యులు కలిసి సంఘమగును. యూదులు, ఆయన లోక రాజని తప్పు అభిప్రాయపడి ఈ భాగ్యము పోగొట్టుకొనిరి. మనముకూడ పెండ్లికుమారుని విషయములో ఏ విధముగా పొరపడినను, ప్రేమ తగ్గినను, పెండ్లికుమార్తె వరుసలోనికి చేరలేము గనుక జాగ్రత్తపడవలెను. పెండ్లికుమార్తెగా ఎత్తబడువారికి ఉండవలసిన లక్షణములు: విజ్ఞానము, విన్నపము, విశ్వాసము, విధేయత.

1) విజ్ఞానము - రాకడను గూర్చిన సంగతులు యావత్తు పూర్తిగా తెలిసికొనవలెను. 2) విన్నపము – ప్రార్థించవలసిన సంగతులన్నియు ప్రార్థింపవలెను. 3) విశ్వాసము - ప్రభువు నన్ను పెండ్లికుమార్తె వరుసలోనికి చేర్చుకొనునని నమ్ముట 4) విధేయత – వాక్యము చెప్పిన రీతిగా అనగా ప్రభువు చెప్పినది చెప్పినట్లు చేయుట.

పదిమంది కన్యకలలో (మత్తయి 25వ అధ్యాయము) ఐదుగురు మిగిలిపోయిరి. కారణమేమనగా పెండ్లికుమారుని మీది ప్రేమ కొద్దిగా తగ్గినది. ప్రకటన 2:4. గనుక ప్రభువా! పెండ్లికుమార్తె వరుసలోనికి వచ్చువారిని త్వరగా సిద్ధము చేయుమని ప్రార్థించవలెను.

## రాకడకు సిద్ధపడుట

1. బైబిలు అంతయును తెలిసికొనవలెను. 2. సువార్త పని ముగించి యుండవలెను, అనగా ఎవరికి చెప్పగలమో వారికి చెప్పియుండుట, పత్రికాదులు మొదలైనవి పంచిపెట్టుట 3. చేయవలసిన ప్రార్థనలన్నియు చేసి ముగించవలెను 4. ఇవ్వవలసిన చందాలన్నియు ఇచ్చివేయవలెను, తీర్చవలసిన అప్పులన్నియు

తీర్చివేయవలెను 5. తప్పులు ఒప్పుకొని ఇతరులతో సమాధాన పడవలెను 6. ఇదివరకు వ్రాసికొన్న నోట్సులు ఒక పర్యాయము చూచు కొనవలెను, కూటనాయకులు మెంబర్లకు ఒక పర్యాయము నోట్సు చదివి వినిపింపవలెను 7. చేయవలసినవి చేతునను తీర్మానము చేయవలెను 8. ఇదివరకు నోట్సుమీదను, ఇతరుల ప్రార్థనమీదను ఆనుకొన్న యెడల ఇప్పుడది మానివేయవలెను. మీకు మీరే ప్రార్థనాస్తుతులతో కనిపెట్టవలయును. వాక్యమును ఆధారము చేసికొని, ప్రభుయేసునందలి విశ్వాసముతో సిద్ధపడవలెను. రాకడను గురించి పత్రికలలోను, నోట్సులలోను ఉండు సంగతులన్నియు చదివియుండవలెను 9. మనము చేయుదుమనునవి చెప్పి చేయనియెడల, ప్రభువును తనపని ఎట్లు చేయునని నీవు చెప్పగలవు? సిద్ధపడుటలో ఆలస్యము చేయగూడదు. నీవు వెళ్లి అలాగు చేయుమని ప్రభువు ఒక ధనికునితో చెప్పెను. ప్రభువా! ఎవరు చేయవలెను? అని అడుగనక్కరలేదు. గనుక ఎవరు చేయవలసినది వారు చేయవలెను. నాకు రాకడనుగూర్చి తెలియలేదు అని నీవు అందువేమో! తెలిసికొనక పోవుట ఎవరి తప్పు? నీవు రక్షింపబడిన తర్వాత ఎక్కువ సేవ చేసిన యెడల ఎక్కువ ఫలితము పొందుదువు గాని రాకడలో పాలెక్కడ? నీవు ఎక్కువ బైబిలు చదివిన యెడల ఎక్కువ జ్ఞానము పొందుదువు గాని రాకడలో పాలుయెక్కడ? నీవెక్కువ మందినిగూర్చి ప్రార్థనచేసి యెడల, ఎక్కువ ఫలితము పొందుదువు గాని రాకడలో ఫలితము నీకు ఎక్కడ? ఎక్కువ సువార్త పనిచేసిన యెడల ఎక్కువ సువార్త ఫలితము పొందుదువు గాని రాకడలో పాలెట్లుండును? ఎక్కువ చందావేసిన యెడల, దానికి ఫలితముగాని రాకడలో పాలెట్లుండును? రాకడకు సిద్ధపడితేనే రాకడలో పాలుండును. 10. జలప్రళయము కథ, దానియేలు 2,7 అధ్యాయములు, ఏలీయా ఆరోహణము, హనోకు ఆరోహణము, మార్కు 13:32-37; వీటి వివరము బాగుగా తెల్సుకొనవలెను. రాకడనుగూర్చి ప్రభువు చెప్పిన మాటలు అపోస్తలుల మాటలు, పూర్తిగా నేర్చుకొనవలెను.

**ప్రశ్నలు:** 1. చదువరీ! క్రీస్తుప్రభువు త్వరగా వచ్చుననియు, అనగా ఆయన వచ్చుటకు ఆయనకేమియు అడ్డములు లేవని అర్థమనియు, గురుతులైన

తర్వాత ఆయన త్వరగా వచ్చుననియు గ్రహించినావా? 2. ఫలానప్పుడు వచ్చెదనని ప్రభువు తారీఖు చెప్పలేదు గనుక ఎప్పుడుబడితే అప్పుడే ఆయన వచ్చునని గ్రహించినావా? 3. బహిరంగమైన గురుతులే కాదు, ప్రభువు నీకు స్వయముగా చెప్పిన గురుతు గ్రహించినావా? అనగా నేను వచ్చు వేళ అయినదని ప్రభువు నీకు చెప్పుట గ్రహించినావా? 4. నీవు రక్షింపబడియున్నావని నీకు నిశ్చయమేనా? ఇదికూడ ప్రభువు నీకు చెప్పినాడా? 5. నీవు పరిశుద్ధాత్మ బాప్తిస్మము పొందినావని ప్రభువు నీకు చెప్పినాడా? ఇది నిశ్చయమేనా? 6. ఇంతకాలము సిద్ధముగా నుండి ఆయన వచ్చునప్పుడు చల్లబడెదవని నీకు తోచినదా? 7. చెప్పబడిన వారందరు అబద్ధ ప్రవక్తలు కారనియు, బైబిలులో చెప్పబడిన అబద్ధ ప్రవక్త, యేడేండ్లలో వచ్చుననియు, ఎవరుబడితే వారు అంతెక్రీస్తు కాదనియు, అతడు ఏడేండ్లలో వచ్చుననియు గుర్తించినావా? 8. అబద్ధ ప్రవక్తలైనను, అంతెక్రీస్తు యైనను; క్రీస్తుయొక్క దైవత్వము ఒప్పుకొనని వారికిని, లోకము యొక్క ఆందోళన చూచి రెండవరాకడ దగ్గరపడినదని చెప్పిన, ఇవన్ని 2000 సం॥ముల నుండి ఉన్నవేగాని, క్రొత్తవి కావు అని చెప్పు వారికిని, గురుతులు కొన్ని స్థలములలోనేగాని అన్ని స్థలములలో లేవనువారికిని; ఈ రీతిగా రాకడకు ఎదురు ప్రశ్నలు వేయువారికి జవాబులు చెప్పగలవా? 9. నేను తప్పకుండ ఎత్తబడుదునను విశ్వాసమును బట్టి ఆనందించువారికిని, నేను రాకడ సంగతులన్నియు నేర్చుకొన్నాను గనుక ఎత్తబడుదునని చెప్పు వారికిని, నాయందు అభిమానముగల వారందరు నన్ను గురించి ప్రార్థించుచున్నారు గనుక నేను ఎత్తబడుదునని తలంచు వారికిని, నేను బాప్తిస్మము పొందినాను గనుక ఎత్తబడుదునని తృప్తిచెందు వారికిని, మనవలె ఇన్ని సంగతులు నేర్చుకొనక, సిద్ధపడక - కేవలము యేసు ప్రభుని నమ్మిన వారిని ఆయన తీసికొని వెళ్ళును గనుక నన్నుకూడ తీసికొనివెళ్ళును అని పలుకు వారికిని, ఆయన రాకడను గూర్చికూడ సువార్త ప్రకటనలో చేర్చి ప్రకటించుచు అనేకమందిని నమ్మింపజేయుచున్నాను గనుక తప్పకుండ ఎత్తబడుదునని భ్రమపడు వారికిని, చెప్పు జవాబు నీ దగ్గర నున్నాదా? ఇవన్నియు ఎత్తబడుటకు నిజమైన కారణములేనా? పై సంగతులు అనుకొనువారిని

గురించియే, పరిశుద్ధాత్మకు విరోధమైన పాపమని హెబ్రీ 6:1-7వ॥లలో ప్రభువు చెప్పుచున్నారు. 10) ఎత్తబడుదునని, పైన చెప్పిన విధముగ సంతోషించు వారికి యెహెజ్కేలు 33:23-30లో ఉన్న సంగతిని గూర్చి జ్ఞాపకము చేసినావా? 11) ఎవరు వాక్యము విందురో, ఎవరు విని విశ్వసింతురో, ఎవరు విశ్వసించిన ప్రకారము విధేయులై నడుచుకొందురో, ఎవరు విమలాత్మ ప్రోక్షణము అనగా పరిశుద్ధాత్మ బాప్తిస్మము పొందుదురో, ఎవరు ఎత్తబడవలసిన నూతన యెరూషలేములో నుండు కాంతిని చూచుటకు భూలోకములోనే తర్ఫీదులగుదురో, ఎవరు యోహానువలె ఈ లోకములోనే యేసుక్రీస్తు ప్రభువుతో మిక్కిలి సహవాసము చేయుదురో; అట్టివారు ఎత్తబడుదురు. 12) అబద్ధ ప్రవక్తలు ఎవరు? ఎ) క్రీస్తు అక్కడ ఉన్నాడు, ఇక్కడ ఉన్నాడు అని చెప్పువారు అబద్ధ ప్రవక్తలు. అలాగు అననివారిని చూచి కొందరు బోధకులు, ఇతర బోధకులను అబద్ధ ప్రవక్తలని చెప్పుచున్నారు. అట్లు ఇతరులను, అబద్ధ బోధకులు అనువారే అబద్ధ ప్రవక్తలు. బి) చివరి రోజులలో అపహాసకులు వచ్చి, సృష్ట్యాది మొదలు ఇప్పటివరకు ఇట్లేయున్నది గనుక రాకడ ఇప్పుడని ఎట్లు చెప్పగలమని అనువారు అబద్ధ ప్రవక్తలు. సి) రాకడ సమీపముగా లేదని గురుతులు జరిగిన తరువాత కూడ ఎవరు అందురో, వారే అబద్ధ ప్రవక్తలు. డి) రాకడను గురించి బోధించు వారిని చూచి, అది తప్పు అని ఎవరు చెప్పుదురో వారే అబద్ధ ప్రవక్తలు. 13) కృపను లోకువ కట్టుట అనగానేమి? కొందరు – 'నాకు సిద్ధపడుట చాలా ఇష్టముగాని ఆటంకములున్నవి, అయితే ప్రభువు నా ఆటంకములు తొలగించి నన్ను రాకడలో తీసికొని వెళ్ళునని' తలంచుదురు. దేవుడు తన కృప చొప్పున చేర్చుకొన్నను, న్యాయమునుబట్టి శిక్ష వచ్చును. రాకడకు ముందు మనిషి కృపాకాలములో నుండును. ప్రభువు అనేకమైన గడువులిచ్చును, ఈ గడువులు త్రోసివేసినట్లయిన మనిషి న్యాయము దగ్గరకు వెళ్ళవలసి ఉండును. కృపలో మహిమ ఇవ్వబడినది గనుక మనిషి ఆ గడువును వాడుకొనకపోయిన, న్యాయమువచ్చి రావలసిన మహిమ తీసివేయును. 14) ముద్రల, బూరల, శ్రమలు అయిన తర్వాత మహా భయంకర శ్రమలైన పాత్రల శ్రమలకు ముందు,

దేవుడు గొప్ప స్వరముతో, 'నా ప్రజలారా! నా తట్టు తిరగండి' అనును, అనేకమంది తిరుగుదురు. అయితే ఆయనను యెరిగినవారే కృపను లోకువ కట్టినవారు, వారే కృపను ద్వేషించినవారు, మారుమనస్సు లేనివారు. తల్లిదండ్రులను లోకువ కట్టువారు తమ పిల్లలే, బయటివారు కారు. ఇతరులైతే ఎదిరింతురు. అలాగే దేవుని సంగతులు ఎరిగినవారే దేవుని లోకువ కట్టుదురు. నోవహు ఓడ మూయబడును, కృప ఆగిపోవును. తప్పిపోయిన కుమారుడు, తండ్రిని క్షమాపణ కోరుకొన్నాడు. విడిచిపెట్ట వలసినవి విడిచిపెట్టినాడు, పూర్తిగా వచ్చివేసినాడు. పూర్తిగా రావడము కుమారత్వమునకు సంబంధించినది గనుక తండ్రి కుమారునిగా చేర్చుకొనెను గాని దాసునిగా చేర్చుకొనలేదు. ఎవరైనను సిద్ధపడిన తర్వాతనే 'అయోగ్యుడను' అనిన బాగుండును. గాని సిద్ధపడక ముందు ఆ మాట అనుట బాగుండదు.

# రాకడ ప్రార్థనలు

## (రాకడ ప్రార్థనలు - ప్రత్యేకమైన, ప్రాముఖ్యమైన ప్రార్థనలు)

## మైదాన బోధకుల కొరకైన ప్రార్థన

ఎ) త్రియేక దేవుడవైన తండ్రీ! యేసుప్రభువా! మా మొదటి ప్రార్థన: 'బోధకులను పంపించుము'. భూదిగంతముల వరకు నీ సువార్త ప్రకటింపవలెను అని (మార్కు 16:15) లో ఉన్నది. కాబట్టి నమ్మకమైన స్వంత పని వారిని అనేకమందిని లేవనెత్తుము. ఇప్పుడున్న పని కొంతవరకు బాగుగా యున్నప్పటికిని, కొంతవరకు మందముగా ఉన్నది. కాబట్టి చురుకుదనముగా పనిచేసే బోధకులను, స్త్రీలను, పురుషులను పంపించుము. అన్ని దేశములకు పంపించుము. ఓ ప్రభువా! కోత విస్తారము, పనివారు తక్కువ గనుక పని వారి కొరకు తండ్రిని వేడుకొనండి, ఆయన పంపును అని సెలవిచ్చినావు (లూకా 10:2). కాబట్టి ఆ వాక్యమునుబట్టి అడుగుచున్నాము. ఎప్పటికప్పుడే క్రొత్తది అడగండి అని చెప్పినావు (మత్తయి 7:7), ఇప్పుడు అడుగుచున్నాము పని పూర్తి అయ్యేవరకు అడుగుచునే యుందుము. నీకు వందనములు. ఎందుకంటే ఇచ్చేవాడవు, పనివారిని పంపేవాడవు నీవే. మరియు అడగండి, వేడుకొనండి అని చెప్పియున్నావు. అందుకే నిన్ను ఇప్పుడు వేడుకొనుచున్నాము.

బి) సమర్పణచేసి కేవలము నీ మీద ఆనుకొనియుండే పనివారిని పంపుము. సొంతాలోచనకాక, వ్యాఖ్యానము కాక, ఇతరుల ఆలోచనకాక, కేవలము నీయాత్మ అందించు వర్తమానమే (మత్తయి 10:19), సర్వజనులకూ అందించే, ప్రముఖులైన బోధకులను పంపించుము. ఇప్పుడు పని మీదనున్న బోధకులను, అట్టి బోధకులనుగా మార్చుచునే యుండుము.

సి) పనివారియొక్క బలహీనతలు నీ అమూల్య రక్తము వలన శుభ్రము చేయుచు, ఒక దరినుండి శుద్ధిచేయుచు, మరియొక దరినుండి బలము కలిగించుచుండుమని నిన్ను వేడుకొనుచున్నాము (1యోహాను 1:7).

డి) ఇప్పుడున్న పనివారు ఏ పద్ధతుల మీద, ఏ సాధనముల మీద, ఏ సాధనముల మూలముగా పనిచేయుచున్నారో, ఆ పద్ధతులను, ఆ సాధనములను దీవించుమని వేడుకొంటున్నాము. మా మనవులు ఆలకించెదవని నమ్మి నిన్ను స్తుతించుచున్నాము.

ఇ) ఇప్పుడున్న బోధకులు చేయుచున్నది గొప్పపని, అద్భుతకరమైనపని. అనగా బైబిలు గ్రంథమును రెండువేల కంటే ఎక్కువ భాషలలోనికి తర్జుమా చేయుటయే, అది నీ ఆత్మయొక్క పని. పెంతెకొస్తు దినమున నీ శిష్యులు అనేక భాషలలో సువార్తను బోధించిరి. ఇప్పుడు నీ బోధకులు, అప్పుడు మాట్లాడిన భాషలకంటే ఎక్కువభాషలలో మాట్లాడుచు సువార్త ప్రకటించుచున్నారు. కాబట్టి నీకు స్తోత్రములు. ఆ పని ఇంకను వృద్ధిలోనికి వచ్చునట్లు మార్చుము. చిన్నచిన్న భాషలున్నవి. వాటిని నేర్చుకొనుచు, వాటిలోకూడ నీ వాక్యము అచ్చువేయించుటకు పూనుకొన్న నీ పనివారిని, నీ ఆత్మచే వెలిగించుచు, వారిని, వారి పనిని దీవించుము.

ఎఫ్) ఓ ప్రభువా! ఇశ్రాయేలీయులు అనేక సంవత్సరముల క్రిందట చెదరిపోగా, వారినిప్పుడు వాగ్దాన దేశమునకు చేర్చుచున్నందుకు వందనములు. అలాగుననే బాబెలు గోపుర నిర్మాణమప్పుడు చెదరిపోయిన వారినందరిని, నీ మందలోనికి చేర్చునట్లుగా బోధకులను ప్రేరేపింపుము. మా ప్రార్థన యావత్తు: రెండవ రాకడకు సంఘమును సిద్ధపర్చునట్లు పని చేయగల బోధకులను పిలుపుము. ఎందునకగా అనేకమంది బోధకులు, నీ రాకడ నిజమని నమ్ముచున్నారు గాని నీవు

త్వరగా వచ్చుచున్నావని నమ్ముటలేదు గనుక ఆ బోధకులకు నీవే బోధకుడవైయుండి, త్వరగా వచ్చుచున్నావని బోధపర్చుము.

జి) ఓ యేసుప్రభువా! నీ శిష్యులను భూదిగంతముల వరకు సువార్త ప్రకటించేటందుకు సిద్ధపరచినావు (మార్కు 16:15). అలాగే నేటికాల బోధకులను కూడ రాకడకొరకు సంఘమును సిద్ధపరచునట్లు, పంపుమని వేడుకొనుచున్నాము. నేటి ప్రార్థన విందువని నమ్ముచు నిన్ను స్తుతించుచున్నాము. అట్టిబోధ నీ రాకడబోధ.

హెచ్) ఈ గదిలోనున్న మేముకూడ తీవ్రముగా బోధించుటకై, బలహీనులమైన మాకు బలము, జ్ఞానహీనులమైన మాకు జ్ఞానము; చురుకుదనము లేని మాకు చురుకుదనము; సమయములేని మాకు వీలైన సమయము దయచేయుమని వేడుకొనుచున్నాము.

ఐ) మా ప్రార్థన, లోకమంతటిలో ఆయా స్థలముల యందు పనిచేయుచున్న పాత బోధకులను గురించియు, క్రొత్త బోధకులను గురించియునై యున్నది. ఈ రెండు రకములైన బోధకులు, ప్రజలకు సరిపోయేవారై యుండునట్లు, బోధకులను సరిచేయుమని వేడుకొను చున్నాము.

జె) కృపగల తండ్రీ! నీకు స్తోత్రము. కొందరికి రాకడ వర్తమానము తెలిసినను అందచేయుటలేదు. వారికి చెప్పే వాక్కు, నచ్చచెప్పే వాక్కు, ఖండించే వాక్కు, బోధపర్చే వాక్కు, ప్రత్యక్షపర్చే వాక్కు లేదు. సజ్జనులైనప్పటికిని వాక్కు లేదు. గనుక వారికి వాక్కు దయచేయుమని వేడుకొనుచున్నాము.

కె) ఓ ప్రభువా! బోధకులు లేనిదే ఎవరు ప్రకటించెదరు? ఒకవేళ ప్రకటించినను అది హృదయమునకు అందదు. నేను బాగుగా బోధించగలను అని అనుకొనేవారు కూడ బోధించలేరు. గనుక ఉన్నది ఉన్నట్లు, పూసగ్రుచ్చినట్లు చెప్పగల బోధకులను సిద్ధపర్చుమని వేడుకొనుచున్నాము.

యల్) దయగల తండ్రీ! బోధకులు బోధకులుగా మాత్రమే ఉంటే, ప్రజలు ఆనందింపరు. బోధప్రకారము నడుచుచు బోధిస్తుంటే వినెదరు, నీవైపు తిరుగుదురు. బోధ ఒకమూల, ప్రవర్తన ఇంకొక మూలను ఉంటే ఎవరు వింటారు!

కాబట్టి ఇవి రెండును సమానముగా ఏర్పరచుకొనే బోధకులను సిద్ధపర్చుము. మంచి ప్రవర్తనగల క్రైస్తవులు మాత్రమే కాదు, మంచి బోధలు చేసే క్రైస్తవులుకూడ అవసరమైయున్నారు. అధికారులవలన ఏర్పాటు చేయబడిన బోధకులే కాక, రహస్యముగ నీవలన ఏర్పర్చబడిన బోధకులుకూడ వెలుపలికి వచ్చి, వెలుపల నున్నవారిని లోపలికి తీసికొని వచ్చునట్లు, వారిని ఆకర్షించుమని వేడుకొనుచున్నాము (ఆది 19:16). నీ కృపకు అనేక స్తోత్రములు. నీవు వినువాడవు గనుక ఎన్ని మనవులైనను చేసికొంటాము. బోధకులను గురించి చేసిన ఈ మా ప్రార్థన, తక్కినవారి ప్రార్థనలతోపాటు నీ మహిమ సింహాసనము దగ్గరకు చేర్చుకొనుము. ఆమెన్.

## 2. రహస్య సన్యాసుల కొరకైన ప్రార్థన

దయగల యేసుప్రభువా! పరలోకములో అనగా దేవదూతల లోకములో, మోక్ష లోకములో, వాయుమండల లోకములో, భూలోకములో, పాతాళలోకములో ఉన్న ప్రతివారి జీవితము నీ చేతిలో యున్నది. మరణము యొక్కయు, పాతాళలోకము యొక్కయు తాళపు చెవులు నా చేతిలో యున్నవి అని ప్రకటన వ్రాసిన యోహానుతో చెప్పినావు (ప్రకటన 1:18). పరలోకమందును, భూమిమీదను నాకు సర్వాధికారమియ్యబడియున్నది అన్నావు (మత్తయి 28:18). కాబట్టి గుహలలో యున్న రహస్య సన్యాసుల, గుహ నివాసులమీద కూడ నీ దృష్టి, అధికార మున్నది గనుక వారిని బయటికి తీసికొని రమ్మని వేడుకొనుచున్నాము. ఒక పొలములో కొంతమంది పనిచేయుచుంటే, ముగింపు చేయనందున, రైతు మరికొంతమంది పనివారిని పెట్టును. అలాగుననే ప్రభువా! మైదానములలో పనిచేయుచున్న బోధకులు, పూర్తి చేయలేక పోవుచున్నారు గనుక పూర్తి పనిని చేయుటకు మాత్రమేకాక బోధకులకు ఉద్రేకము పుట్టించుటకును, మారుమూలలోనున్న రక్షితులను బయటికి లాగుకొని వచ్చి, మీరుకూడ బోధపని చేయండని వీధులలో నిలబెట్టుటకును, ఆ రహస్య సన్యాసులను పంపుము అని వేడుకొనుచున్నాము. నావలోనున్నవారు వల లాగలేక యున్నప్పుడు, పాలివారిని పిలిచినారు గదా? (లూకా 5:7) వారు వచ్చినప్పుడు లాగే పని పూర్తియైనది. అలాగే ఇప్పుడు మేము నీ సువార్త వలను భూలోకమంతట

వేసియున్నాము. లాగుటకై రహస్య సన్యాసులను పంపుమని వేడుకొను చున్నాము. నీకు స్తోత్రములు. మైదాన బోధకులమైన మేము కొద్దిగా బోధ చేయుచున్నాము. ఎప్పుడో ఒక పర్యాయము నీ సన్నిధిలో కూడుకొనుచున్నాము గాని అది చాలదు, బోధపని కూడ చాలదు. మేము చేయు పని అసలే చాలదు. సన్నిధాన వర్తలను ఇతరులు ఆక్షేపించుచున్నారు. వీరు సోమరులు గనుక పనిలేక గదులలో కూర్చుండి, అరచుచున్నారని అనేక పేర్లు పెట్టుచున్నారు గాని గుహలలోనున్న రహస్య సన్యాసులకు ఎవ్వరు పేర్లు పెట్టలేరు. వారు నిత్య సన్నిధానవర్తనులు గనుక జీవిత కాలమంతయు నీ సన్నిధిలోనే యున్నారు. ఎంతగొప్ప ధన్యత! ఈలాగు నెలకొక పర్యాయము మేమిక్కడ కూడుకొంటే, అధమపక్షము ఒక క్రొత్త సంగతియైన నేర్చుకొనగలము. అయితే వారు ప్రతి రోజు క్రొత్త సంగతులు నేర్చుకొనుచున్నారు. ప్రతి దినము నీ సన్నిధిలో వారుంటున్నారు. మాలో ఎవ్వరును అలాగున్న వారులేరు, గనుక మా కంటే వారే గొప్ప వారు. మరియమ్మ కొన్ని నిమిషములు మాత్రమే, కొంతసేపు మాత్రమే, నీ పాద సన్నిధియందు కూర్చుండెను (లూకా 10:39). అయితే వీరు సంవత్సరాల తరబడి నీ సన్నిధిలో కూర్చుంటున్నారు. మేమెవ్వరమైనను వారి దగ్గరకు వెళ్ళవలెనంటే చలిచేత చనిపోదుము. వారైతే మా దగ్గరకు రాగలరు. వారు మహిమతో నింపబడి యున్నారు గనుక చలితీవ్రతకు ఓర్చుకొనగలరు, ప్రతి వారియొక్క హృదయమును బద్దలు కొట్టగలరు, ఎదిరించే నోళ్ళను కట్టివేయగలరు, బిగించగలరు. కాబట్టి వారిని త్వరలో పంపుమని వేడుకొనుచున్నాము. నీకు స్తోత్రములు. నీవు చెప్పినట్లయితే వారు రాగలరు. మేము వెళ్ళి మాట్లాడితే 'ఎందాక నిద్రమత్తులై యుంటారు! రాకడ సమీపమైనది, ఈ పాటికైన లెండి' అని మమ్మును గద్దించెదరు. ఓడ నావికుడు ఓడయొక్క అడుగుభాగమున నిద్రపోవుచున్న యోనా ప్రవక్తను లేపినట్లు, వారు వచ్చి మైదాన బోధకులను లేపగలరు (యోనా 1:6).కాబట్టి వారిని త్వరగా పంపించుమని వేడుకొంటున్నాము. నీకు స్తోత్రములు. కోత విస్తారము, బోధకులు తక్కువయని నీవు చెప్పినప్పుడు, సన్యాసులున్నట్లు ఎక్కడ వ్రాయబడలేదు గాని క్రైస్తవ శకములో మాత్రము ఉన్నట్లు, సంఘ చరిత్రవల్ల కనబడుచున్నది. వారు గొప్ప పని చేస్తున్నారు, నీకు స్తోత్రములు. మా అందరికొరకు విజ్ఞాపన

ప్రార్థనలు చేయుచున్నారు. మావలె వారు మీటింగు మధ్యమధ్యలో బయటికి వెళ్ళువారు కారు. గాని నీ సన్నిధిలో స్థిరముగా ఉండేవారు. అది రెండవ పని. మూడవ పని ఏమనిన నీవు ఏమి చెప్పితే వారు అది వినేవారు. గనుక మా మైదాన బోధకులు ఏమి చెప్పగలరు! ఒకవేళ చెప్పినయెడల ఎంతమంది వినగలరు! వారైతే విసుగుదల లేకుండ నీవు చెప్పు మాటలు వినుచున్నారు. వారికి ఎంత ధన్యత! 1) నీ సన్నిధిలోయుండే భాగ్యము 2) చలికి సహించే భాగ్యము 3) మా ఆహారము అక్కరలేని భాగ్యము 4) నీ వాక్యము వినే భాగ్యము 5) నీ మహిమ అనుభవించే భాగ్యము 6) ముఖాముఖిగా నిన్నుచూచే భాగ్యము. 7) మా అందరి కొరకు విజ్ఞాపనలు చేసే భాగ్యము. ఈ ఏడు భాగ్యములు కలిగియున్న రహస్య ఋషులను, మా మైదానముల మీదికి పంపుమని వేడుకొనుచున్నాము. ఇదివరకు కూటములో, వారిని గురించి ప్రార్థించినాము. ఆ ప్రార్థనల గొలుసు తెగిపోయినది, మరల ఇప్పుడు ప్రారంభించుచున్నాము. 1889వ సం॥న పుట్టి, ఈ ప్రాంతములకు 1929 సం॥లో బోధకుడుగా వచ్చిన సాధు సుందర్‌సింగు చలిని సహించగలడు. గనుక ఆయన వెళ్ళి వారినిచూచి 'బైటికి వచ్చివేయండి' అని చెప్పగా వస్తాం! వస్తాం! అని చెప్పిరి. ఇంకా రాలేదు. సుందర్‌సింగు చెప్పడముకాదు. యేసుప్రభువా! నీవే చెప్పుము. ఆ పైన మేము కోరుకొనవలెను. వల లాగలేనివారు కోరుకొంటే పాలివారు రాలేదా? (లూకా 5:7). అలాగే క్రైస్తవ బోధకులు నిన్ను కోరుకుంటే, నీవు వారితో చెప్పి వారిని బయటకు రప్పించగలవు. మా దగ్గరనుండి వారి రాక విషయమైన దరఖాస్తు ముందుగా నీ దగ్గరకు రావలెనుగదా! ఎంతమంది ప్రార్థించుచున్నారు? తెలిసిన మేమే ప్రార్థించుట లేదు. ఇప్పుడు చేసిన తరువాత మరలా ఒక సంవత్సరము వరకు ఆ తలంపు యుండదు. అలాగైతే వారెట్లు రాగలరు! గనుక మైదాన బోధకులు కోరుకొనవలెను. ఆ కోరికను ప్రభువా! నెరవేర్చుము. ప్రభువా! భూలోక సంఘము వారి రాకడ కొరకు ప్రార్థించునట్లు ప్రేరేపింపుమని వేడుకొను చున్నాము,స్తోత్రములు. అప్పుడు ఒక సంగతి జరుగును. వారు వస్తే దేశాలలో, పట్టణములలో, పల్లెలలో గొప్ప అల్లరి, ఆందోళన కలుగును. కలిగితే కలిగినదిగాని వారిని త్వరలో రప్పింపుము.

యువరాజుగా రానైయున్న యేసుప్రభువా! పెండ్లి కుమారుడవుగా రానైయున్న యేసుప్రభువా! నీకు స్తోత్రములు. ఈ సన్యాసుల గుంపునకు పెద్దగానున్న, కైలాస ఋషిగారి సంగతులుకూడ మాకు తెలియపరచుచుండుమని వేడుకొనుచున్నాము. మా దేశములో యొక గొప్ప మహాఋషిని లేపియున్నావు. మా దేశమునకు ఇతర మతస్తులు, ఋషుల దేశమని పేరు పెట్టియున్నారు. అట్టి దేశములో నీ అనుచరులలో ఒకరిని లేపినందున నీకనేక స్తోత్రములు. మా దేశములో, ఎక్కువగా నీ సన్నిధిలోయున్న సుందర్‌సింగును బయటకు రప్పించిన నీకనేక వందనములు. ఆయనకును, ఋషికిని స్నేహము కలిపిన నీకు స్తోత్రములు. ఆయన ద్వారా, ఆయన పుస్తకముల ద్వారా, ఆయన ఉపన్యాసముల యొక్క వర్తమానముల ద్వారా, మా దేశమునకు రెండవ రాకడ బోధ ఇంకను విరివిగా వినిపించు చుండుమని వేడుకొనుచున్నాము. రహస్య సన్యాసులు ధ్యానములో యుండగా, పరలోక వాస్తవ్యుల విషయములు, దేవదూతల విషయములు, మా విషయములు వారికి, కైలాసఋషికి తెలియుచున్నవి. అట్టి గొప్పవారిని హిమాలయ పర్వతములలో లేపియున్నావు. గనుక నీకు స్తోత్రములు.

ఒకరు మహమ్మదీయ దేశమునకు సంబంధించినవారు, ఇంకొకరు మా దేశమునకు సంబంధించిన వారు. ఇద్దరిని మా దేశములోనే లేపినావు. వీరును వారును సన్యాసులే, వారు రహస్య సన్యాసులు, అయితే సుందరసింగు బహిరంగ సన్యాసి. వీరి ద్వారా వర్తమానములు వినిపించినావు, ఇప్పుడు ఆ వర్తమానములు దొరకడములేదు. గనుక వాటి ఫలితము ఇప్పుడు చూపించుమని వేడుకొనుచున్నాము. నీకనేక స్తోత్రములు.

## 3. మృతుల కొరకైన ప్రార్థన

యేసుప్రభువా! నీవు ఈ లోకములో నున్నప్పుడు ఒకరిని ఇంటిలో, ఒకరిని బయట, ఒకరిని సమాధిదొడ్డిలో బ్రతికించినావు. ఇంట్లో యాయీరు కుమార్తెను (మత్తయి 9:23-25), బయట నాయీను విధవరాలి కుమారుని (లూకా. 7:12), సమాధిలో నీ స్నేహితుడైన లాజరును (యోహాను. 11:44)

లేపినావు. యాయీరు కుమార్తెను బ్రతికించుమని ఒక మనవి యున్నది. లాజరును బ్రతికించుమని కూడ ఒక విధముగా మనవి యున్నది. వారిద్దరిని బ్రతికించినావు. అయితే నాయీను విధవరాలి కుమారుని గురించి మనవిలేదు, అయినను బ్రతికించినావు. అప్పుడు నీ మొదటి రాకడలో మృతులను బ్రతికించుటవల్ల ప్రజలకు నీవు ఎటువంటి వాడవో, ఎంత శక్తిమంతుడనో తెలియజేసినావు. కాబట్టి ఇప్పుడును, అడిగినను అడగకపోయినను కొంతమంది భక్తులను బ్రతికించుమని వేడుకొనుచున్నాము. వారు వచ్చి ప్రభువు రాకడను గురించి చెప్పగలరు. దేశానికి ఒకరు బ్రతికివస్తే చాలు, అప్పుడు వారు కొంతమందినైనా నమ్మించగలరు. నీ పునరుత్థానమును అందరు నమ్మలేదు, కొంతమంది నమ్మినారు. గనుక నేడును నీవు కొంతమంది భక్తులను లేపిన యెడల, అందరు నమ్మకపోయినను అందరు వింటారు. నీవు లేపినావనే వార్త వినడానికే మేము కోరుకొంటున్నాము. గనుక మృతులను బ్రతికింపుమని కోరుకునే విజ్ఞాపన (మత్తయి 10:8), నీ వాక్యానుసారమైన విషయమేగాని మా సొంతము కాదు. నీ వాక్యములో యున్నది గనుక మేమడుగుచున్నాము. నీవు నీ శిష్యులకు ఒకమాట చెప్పినావు, 'రోగులను స్వస్థ పరచండి' (మత్తయి 10వ అధ్యాయము), అక్కడే ఆగలేదు, వెంటనే ఇంకొకమాట అన్నావు, 'మృతులను లేపండి' అన్నావు. (మత్తయి 10:8). నీ శిష్యులు అలాగు లేపినారు. దొర్కాను పేతురు లేపినాడు (అపో॥కార్య॥ 9:41). కాబట్టి నీవు వచ్చి కొంతమందిని లేపితే, నీవు చెప్పిన వర్తమానమే వారు సిద్ధపర్చుకొందురు. నీ మరణ సమయమందు పరిశుద్ధ మనుష్యులు లేచి వచ్చినారు గదా? (మత్తయి 27:52), వారు అందరికి కనబడినారు (మత్తయి 27:53). అప్పుడు నీవనుకొనినవారినే లేపినావు. అందరిని లేప లేదు. గనుక ఇప్పుడు కూడ నీవు అనుకొనినవారినే లేపుము. మేము పేర్లు చెప్పుట ఎందుకు?

మృతులు వచ్చినప్పటికిని నమ్మనే నమ్మరు యని అబ్రాహాము ధనవంతునితో చెప్పెను లూకా (16:31). ఆ మాట చెప్పిన తర్వాత నీవు లేచినావు, దొర్కా లేచినది. మృతులు లేచిచెప్పినా, నమ్మరని చెప్పిన తర్వాత నీవు లేచినావు, దొర్కాను లేపినావు గనుక ఆ మాట తర్వాత వచ్చిన ఈ మా

కాలములోకూడ కొంతమందిని లేపుము. అయితే యేసుప్రభువా! నీవు భూలోకానికి నరరూపిగా రాకముందు కూడ లేపినావు. ఎలీషా కాలములో లేపినావు గదా! (2రాజులు 4:37). గనుక పాత నిబంధన కాలములోను క్రొత్త నిబంధన కాలములోను మృతులను లేపినావు యనేది యున్నది గనుక ఇప్పుడు మేమడుగుచున్నాము. ఇది సంఘకాలము. త్రియేక దేవుడవైన ఓ తండ్రీ! పాత నిబంధన కాలములో, క్రొత్త నిబంధన కాలములో, సంఘ కాలములో నీకు మిక్కిలి ప్రియమైన సంఘకాలములో, ఈ మూడు కాలములలో మృతులను లేపిన నీవు, నీకు మిక్కిలి ప్రియమైన ఈ వధువు సంఘకాలములోకూడ మృతులను లేపగలవని నమ్ముచున్నాము. ఒకప్పుడు నీకు సాధ్యమైనది ఇప్పుడు కూడ సాధ్యమే. త్రియేకదేవా! త్రికాలములలో నీ మహిమను చూపించుము. గతించిన రెండు కాలములలోని నీ మహిమ, ఈ మూడవ కాలములో యున్న మాకు జ్ఞాపకము చేయడమువలన నీ ప్రభావము కనబర్చుమని త్రియేక దేవా! నిన్ను వేడుకొనుచున్నాము. నీ వాక్య చరిత్రనుబట్టి ఈ ఉదయమున, ఈ మధ్యాహ్నామున చేసిన ఈ ప్రార్థనలు ఇప్పుడు రానైయున్న ప్రభువు ద్వారా ఆలకించుము. ఆమెన్.

## 4. దేవదూతల కొరకైన ప్రార్థన

యేసుప్రభువా! మేము రక్షణ స్వాస్థ్యము పొందవలసిన వారమై యుండగా మాకు పరిచర్యచేసే దేవదూతలను యేర్పరచినావు (హెబ్రీ 1:14). ఆ సమూహములో కొందరిని భూలోకమునకు పంపుమని వేడుకొను చున్నాము. ఈ సంగతి నీ వాక్యానుసారము కాబట్టి అడుగుచున్నాము. వాక్యములో లేనిది మేము అడగలేము. భూమిమీదయున్న రెండు గుంపుల వారు మనుష్యులే. అట్టి మనుష్యులను పనివారిగా పంపవేడుకొనుమని నీ వాక్యములో యున్నది. అందుచేత అడిగెదము. అలాగే దేవదూతలను కూడ నీవు ఈ లోకమునకు పంపినావని నీ వాక్యములోయున్నది గనుక అడుగుచున్నాము. సొదొమ పట్టణమునకు నాశనకరమైన తీర్పు వినిపించుటకై, మనుష్య రూపములో దేవదూత లిద్దరిని పంపినావు. గనుక రాకడ సమీపమందు ఇప్పుడు కూడ వారిని పంపుమని వేడుకొనుచున్నాము (ఆది 19అధ్యా॥). కొర్నేలి

ప్రార్థించినప్పుడు దేవదూతను పంపినావు, ఆయన వర్తమానము ఇచ్చినాడు. 'నీ ధర్మకార్యములు చేరినవి, పేతురు కొరకు పంపుమని' చెప్పెను (అపో॥కార్య॥ 10 అధ్యా॥). మనిషి మాట్లాడినట్లే మాట్లాడెను. అప్పుడు దేవదూతలను పంపిన నీవు ఇప్పుడెందుకు పంపకూడదు! దేవదూతలు ఆకారము లేనివారు (మత్తయి 28:3). అయినప్పటికిని ఒక దేవదూత నిద్రమీదయున్న పేతురును తట్టి, లేవనెత్తి పంపెను (అపో॥కార్య॥ 12:7). మన చేతితో తట్టినట్లు తట్టెను. అది అసాధ్యమైన సంగతి, ఎందుకంటే చేతులుంటే వారు తట్టగలరు. మన చేతులవంటి చేతులు లేనివారు ఎట్లు తట్టగలరు? అయినను దూత ద్వారా పేతురును బయటికి నడిపించుకొని వెళ్ళినావా? లేదా? (అపో॥కార్య॥ 12:7-10). అలాగే ఇప్పుడు కూడ ఒక్కొక్క దేశమునకు ఒక్కొక్క దేవదూతను పంపి, రాకడ వర్తమానము వినిపించుమని వేడుకొనుచున్నాము. నీ మొదటి రాకడలో దేవదూత, మనిషి మాట్లాడినట్లు మాట్లాడి వర్తమానము చెప్పినది. రక్షకుడు పుట్టినాడనే మహా సంతోషకరమైన సువర్తమానము నేను మీకు తెలియజేయుచున్నానని చెప్పినది (లూకా 2:11). అలాగైతే దేవదూతలను లోకమునకు ఇప్పుడు ఎందుకు పంపకూడదు! మొదటి రాకడ సమయములో దేవదూతలను పంపిన నీవు, రెండవ రాకడ సమయములో కూడ వారిని పంపిన యెడల కొంతమందియైనా నమ్మగలరు. రాత్రులు కాదు, పట్టపగలు ఎండ వేళప్పుడు, అబ్రాహాము తన గుడారపు దేరా యొద్ద యుండగా ముగ్గురు దేవదూతలను పంపినావుగదా! వారు మాట్లాడినారు, మనిషి రూపములో కనబడినారు, భోజనము చేసినారు, ఎంత ఆశ్చర్యము! అట్టి దేవదూతలను ఈ రాకడ కాలమందుకూడ పంపించిన యెడల కొద్దిమందియైన నమ్మగలరు (ఆది 18:1-15). మనుష్యులలో పనివారు తక్కువ, దేవదూతలలో కోటానుకోట్ల పనివారున్నారు. ఒక కోటి దేవదూతలను పంపినచో, లోకమంతటా ఆవరింపగలరు. వారు మైదాన బోధకులకంటే, గుహవాసుల కంటే ఇంకా ఎక్కువ ధాటిగా పనిచేయగలరు. ప్రభువా! నీ దూతలు మా పరిచారకులు గనుక వారిని పంపించుమని అనుటకు మాకు హక్కు యున్నది (హెబ్రీ 1:14). ఓ తండ్రీ! మరియొక సంగతి, గొప్ప సంగతి ఏమనగా వారి అంతటి స్నేహితులు మాకు లోకములో ఎక్కడను లేరు. అంతటి

కావలిబంటులు కూడ ఎక్కడనూ లేరు (దా॥కీర్తనలు 34:7). మా రక్షణను గూర్చి ఎల్లప్పుడు ఆలోచించుచు, మాకు సహాయము చేయుటకు సిద్ధముగా నున్నవారు, వారు తప్ప అంత శ్రద్ధగలవారు ఇంకెవరును లేరు, అంత శక్తిగలవారును లేరు. ప్రభువా! నీవు జన్మించినపుడు వర్తమానము మనుష్యులు తీసికొని రాలేదు, దేవదూతలు తీసికొనివచ్చినారు. ఎందుకంటే పరిశుద్ధ దేవకుమారుని, పరిశుద్ధ జన్మమును గూర్చిన పరిశుద్ధ వర్తమానము మోయుటకు, మనుష్యులలోని పరిశుద్ధులుకూడ యోగ్యులుకారు. అందుచేతనే దేవదూత వర్తమానము తెచ్చెను. ఆ కాలములో భక్తులు లేకపోలేదు గాని, ఆ వర్తమానమందించుటకు వారు తగరు. గనుక ప్రభువా! ఈ రాకడ వర్తమానము అందించుటకు మేము ఏ పాటివారము! నీ వార్త మాకు బోధపడదు. అందుచేత మొదటి రాకడకు దూతలను పంపి వినిపించినట్లుగా (లూకా 2: 14), ఈ నీ రెండవ రాకడకు కూడ, నీ దేవదూతలను పంపి వర్తమానము వినిపించిన, మాకెంత సంతోషము! అట్టి సంతోషము కలిగించుదువని నమ్మి, నీకు హృదయ పూర్వక వందనములు చెల్లించుచున్నాము. ఆమెన్.

## 5. ప్రభువు రాకకొరకైన ప్రార్థన

యేసుప్రభువా! 1845 సం॥లో, ఆఫ్రికాలోని ఒక వృద్ధురాలికి నీవు కనబడి, 'నేను త్వరగా వచ్చుచున్నానని చెప్పియున్నావట'. మనిషి చెప్పలేదు. తన మనస్సు చెప్పలేదు. గానీ నీవే చెప్పినావు. ఆ రీతిగానే, అప్పటివలెనే ఇప్పుడుకూడ నీవు స్వయముగా వచ్చి, కొంతమందికి చెప్పుమని వేడుకొనుచున్నాము. ఉదా:- కూలీలు సరిగా పని చేయనప్పుడు, రైతు తానే నడుము బిగించుకొని స్వయముగా పనిచేయును గదా! ప్రభువా! నీవు దేవుడవు, మనుష్యుడవు కాబట్టి నీవే స్వయముగా వచ్చి చెప్పుమని వేడుకొనుచున్నాము. ఇది నీ వాక్యానుసారమే. అలాగే కైలాసబుషితో, సన్యాసులతో, సుందరసింగుగారితో, బరంపురంలోని స్త్రీల సమాజముతో, దేవదాసయ్యగారితో 'నేను త్వరగా వచ్చుచున్నానని' చెప్పియున్నావు. గనుక ఆయావారికి నీవే స్వయముగా చెప్పి మా పనిని పూర్తిచేయుము.

మేము చెప్పిన యెడల వారు 'మీకు ప్రభువు కనబడినారా?' అని అడుగు చున్నారు. 'ఔను' అని చెప్పినయెడల అదేమి పక్షపాతము! మాకెందుకు కనబడకూడదు! మాకు కనబడినపుడు మేము కూడ నమ్ముదుము అని కొందరు గడుసు మాటలు పలుకుచున్నారు. అట్టివారికి బుద్ధి చెప్పుటకు కూడ నీవే స్వయముగా కనబడి మాటలాడుమని వేడుకొనుచున్నాము (మార్కు 16:14, మత్తయి 5:8). ఈ ప్రార్ధన నీ వాక్యానుసారమే. ఎందుచేతనంటే 'ఇదిగో త్వరగా వచ్చుచున్నాననే' మాట వ్రాయించినట్లు (ప్రకటన 22:20), ఇప్పుడు కొంతమందితో ఆ మాటే చెప్పుచున్నావు. కొందరితోనే కాదు, ప్రభువా! నీవు అందరి రక్షకుడవు (ఎఫెసీ 4:6) గనుక అందరితోను చెప్పుమని వేడుకొనుచున్నాము ఆమెన్.

**షరా:** దేవదూతలను గాని దేవుడు పంపించిన యెడల, ఒక్కొక్క దేశమునకు, ఒక్కొక్క పటాలముగా దేవదూతలను నిలువబెట్టితే, ఆ క్రిస్తుసు వర్తమానము చెప్పినంత కాలములో చెప్పి ముగించగలరు. జపానులో ఒకదూత, అమెరికాలో ఒకదూత, అలాగే అందరు ఏకకాలములో ఒకేసారి రాగలరు, చెప్పగలరు, వెళ్ళగలరు. చెప్పడము మట్టుకే. అలాగే యేసుప్రభువా! అన్ని దేశములలోనున్న ఒక్కొక్కరి దగ్గరకు వెళ్ళి, ఏక కాలమందు ఒక నిమిషముండగలరు. 300 కోట్లమందివద్ద, 300 కోట్ల క్రైస్తవులుగా కనిపించగలరు, చెప్పగలరు. దూతలైతే ఎక్కడబడితే అక్కడ చెప్పగలరు. అలాగే మృతులైన భక్తులు కూడ ఎక్కడైతే అక్కడే చెప్పగలరు. గాని నీవైతే అందరికి ఏకకాలమందు చెప్పగలవు. నీవు చెప్పుటకు ఎంతసేపు పట్టునంటె, 'ఇదిగో నేను త్వరగా వచ్చుచున్నాను' అని బైబిలులో (ప్రకటన 22:16)లో యున్నది అని చెప్పడానికి ఎంత కాలము పట్టునో, అంత సమయములో ప్రభువా! నీవు అందరికీ చెప్పగలవు. ప్రభువా! మేము నీకు ఆలోచన చెప్పదగిన వారము కాకపోయినను నీ వాక్యమునుబట్టి, నీ శక్తినిబట్టి, 'పరలోకమందున్న మా తండ్రీ' యని ప్రభువు ప్రార్థనలో, నిన్ను ప్రార్థించుటకు నీవు మాకిచ్చిన చనువునుబట్టి, నిన్ను అడగరాని ప్రశ్నలు అడిగినాము, చేయరాని మనవులు చేసినాము. నీవు క్షమించెదవు. మా ఉద్దేశములలో తప్పులుండవచ్చును, వాటిని క్షమించెదవని నమ్మి నీకు వందనములు చెల్లించుచున్నాము. ఆమెన్.

## గమనిక

1. ఈ ఐదు ప్రార్థనలు అందరికి కాదు, ప్రభువుతో మిక్కిలి పరిచయముగల వారికి మాత్రమే.
2. ఇది అనుదిన ప్రార్థనేగాని చేయుటకు శక్తిచాలదు, ఒకవేళ చేయబోతే నామక ప్రార్థన వచ్చును.
3. ఆదివారము ఎక్కువ సమయముండును గనుక మీలోఒకరు ఈ ప్రార్థనలను అతినెమ్మదిగా చదివితే, తక్కినవారు బహునెమ్మదిగా పలుకవలెను.
4. మహా వినయముతో, భయముతో, సంకేతశాలలో యుండవలసిన భక్తితో, క్షమించు పభువా! అనే స్వరముతో, నా ప్రార్థనలవల్ల ప్రభువునకు ఎక్కడ కష్టము కలుగునో అనే జాగరూకతతో, వీలైతే కండ్లకు రుమాలు కట్టుకొని, మనో నిదానముతో ప్రార్థింపవలెను.
5. ఈ ప్రార్థనలు, పద్ధతులు గ్రహింపనివారు వస్తే ఈ ప్రార్థనలు మానవలెను.
6. ఈ ప్రార్థనలు చేయవలెనని ఏర్పాటు చేసికొన్నప్పుడు, కూటస్థులు ఒక్కొక్కరు మాట్లాడుకొని, ఇతరులు రానివేళలో చేసికొనవలెను.
7. అప్పుడు చదువవలసిన పాఠము 'సైన్యములకు అధిపతియగు యెహోవా పరిశుద్ధుడు, పరిశుద్ధుడు, పరిశుద్ధుడు. సర్వలోకము ఆయన మహిమతో నిండియున్నది' (యెషయా 6:3). ఇది కల్పించిన రమ్యరాగముతో పాడవలెను.
8. ప్రార్థన ఆరంభములో నాయకులు ఈ మాటలు చెప్పవలెను. అవేవనగా 'ఈ ప్రార్థనలయొక్క సూత్రములు అతిక్రమించువారికి, ఏ హానియైనా కలిగిన యెడల నన్ను అడగవద్దు' అని నాయకులు సమాజములో ముందుగానే చెప్పవలెను.
9. మధ్యాహ్నము 12 గం॥కు తత్పూర్వమే స్నానముచేసి, రేవు బట్టలు లేదా ఉతికిన బట్టలు కట్టుకొని సంకేతశాలకు (ప్రార్థన స్థలము) రావలెను.
10. సంకేతశాలలో యున్నప్పుడు ఒకరితో ఒకరు మాటలాడకూడదు.
11. బైటికి వెళ్ళకూడదు, దగ్గకూడదు, తుమ్మకూడదు (ఇది అంత ఖండితము కాదు గాని భద్రముగా నుండవలెను.)
12. ఒక గంటకంటే ఎక్కువ యుండకూడదు.

13. మోకాళ్ళమీదనే యుండవలెను.
14. శరీరము బైటగాని, లోపలగాని ఏ విధమైన అపవిత్రత యుండకూడదు.
15. వీలైతే ఉపవాసముండవలెను. (ఆ గంటకే)
16. మన ఎదుట తండ్రీ, కుమార, పరిశుద్ధాత్మ యున్నట్లు ఊహించవలెను. ఊహలోనికి ప్రధానదూతలు, పరిశుద్ధులు వచ్చినట్లుండినను పరవాలేదు గాని ప్రభువు మీది గురి చెదరనీయకూడదు.

షరా: 1) దీనికి ప్రత్యేకమైన గది, అల్లరులు వినబడని గది యుండిన మంచిది. 2) పెండ్లికుమార్తె వరుసలోనికి వచ్చువారికి అనగా లవొదికయ సంఘస్థులకు ఇది సులువుగా కుదరగలదు. 3) నడిపించే వారు స్వయముగా ఒక్కరే, ముందు ప్రాక్టీసు (తర్ఫీదు)చేయకుండ ఎవరికిని చెప్పకూడదు. 4) ప్రతి శుక్రవారం 12 గంటలకు ఈ రాకడ ప్రార్ధనలు చేయవలెను.

### ఆ దినమునకై సిద్ధపడు విధము:

1) తెల్లవారు ఝామున 3 గంటలకు లేచి, దైవగ్రంథమును ఓపికయున్నంత వరకు కొన్ని అధ్యాయములు చదువవలెను.
2) పిమ్మట పనులన్నియు చేయవలెను.
3) తెల్లవారిన పిదప కుటుంబ ప్రార్ధనలో, ఈ రాకడ ప్రార్ధనలు జ్ఞాపకముంచుకొని, కొన్ని అంశములు ఎత్తి రాకడనుగూర్చి ప్రార్థించవలెను.
4) కుటుంబ ప్రార్ధన అయిన పిదప నోరు, చెవి, అవయవములు బిగబట్టుకొన వలయును. ఆ దినమంతా ప్రత్యేకమైన సిద్ధబాటు కలిగియుండ వలెను.
5) ఐదు నిమిషముల తక్కువ 12 గం॥ అయినప్పుడు తల అంటుకొనరాదు, దువ్వెన వెదకరాదు.
6) పిల్లలను దూషించరాదు.
7) మనసు ఆయాసముతో లోనికి రాకూడదు.
8) మెట్టు మెట్టునకు మనోస్తుతి కలిగియుండవలెను.
9) అప్పుడు దైవసన్నిధిలోనికి ప్రవేశింపవలెను.

**షరా:** ఆత్మతండ్రి వచ్చి మిమ్ములను పరీక్షచేయును. ఇది శుక్రవారమునకు తగిన సిద్ధబాటుయై యున్నది. మిగత వారములలో కూడ ఈ పద్ధతి అవలంభించిన యెడల మంచిదే, అది గొప్ప క్రమమైయున్నది. త్రోవను వచ్చేటప్పుడు కుక్క అరిస్తే 'ఛీఛీ' అనకూడదు, యేసు రక్తమునకు జయమనవలెను. త్రోవలో వచ్చేటప్పుడు ఎవరైనా మాట్లాడితే, అవి కేవలము పరిశుద్ధాత్మకు అనుగుణ్యమైన అంశములై యుండవలెను. ఆయాసకరమైన వేవియైనను వాటిని మాట్లాడకూడదు. పెండ్లికుమార్తెకు అవి తగవు. ఇది, చిన్నికన్నియ సన్నిధి కూటములో 10-6-60వ తేదిని, ప్రభువు ప్రత్యేకముగా ఇచ్చిన వర్తమానము.

# రాకడ ప్రార్థనలు

## (5-9-58) వారమునకు ఒక అద్భుతము

ప్రభువా! నమ్మినను, నమ్మకపోయినను ప్రజలకు బోధించుమని నీవు యెహెజ్కేలుతో చెప్పినావు (యెహెజ్కేలు 3:11) గనుక దేవా! నీ రాకడ వార్త అందరికిని చెప్పుము. మరియు (యోహాను 14:14)ను ఆధారమును చేసికొని ప్రార్థించుచున్నాము. ఇంకను బైబిలు మిషనును బైలుపర్చిన సంగతిని ఆధారము చేసికొని ప్రార్థించుచున్నాము. మా ప్రార్థన నెరవేర్పులు కొట్టివేయకుము. ఎందుకంటే నీ శక్తికి మించిన ప్రార్థన మేము చేయము, చేయలేము. మా పొరబాట్లను అంతములేని నీ ప్రేమనుబట్టి క్షమించుము.

1) నీవు డిక్టేషను చెప్పి (వ్రాసుకొనుటకు వీలుగా నెమ్మదిగా బోధించుట), ఎవరిచేతనైనా రాకడ పత్రికను వ్రాయించి, బైబిలు సొసైటీ వారికి పంపించుము. మరియు వారు 2,000 భాషలలో ఆ పేపరు అచ్చువేసి, అమ్మే బైబిళ్ళలో పెట్టవలసినదిగా చెప్పుము. ఈ పని మేము చేయుట నీకిష్టమైతే సరి.

2) ప్రతి భాషలోను, నోటితో ప్రకటించుటకు కొంతమంది ఆత్మగల వారికి, మహిమ శరీరముతో సమానమైన శరీరము ఇచ్చి, గాలిలో పంపించి నీ వార్త చెప్పించుము.

3) కొంతమంది నిద్రలో యున్నప్పుడు, వారి యాత్మలను నీ యిష్టము వచ్చిన వారియొద్దకు పంపించి నీ రాకడ వార్త చెప్పించుము.

4) భక్తులలో కొందరు నీ మరణ దినమున లేచినారుగదా! అట్లే మృతులను లేపి, వారిచేత నియామక స్థలములలో, నియామక సమయము చొప్పున నీ రాకడ వార్త చాటించునట్లు చేయుము.

5) లోకములోనున్న నీ భక్తులలో పర్వతవాసులు, ఋషులు మొదలగు వారున్నారు గనుక వారిని బయటకు రప్పించి నీ వార్త చెప్పించుము.

6) బ్రాడ్‌కాష్టులు (సమాచార ప్రసార కేంద్రములు) ప్రతి పట్టణములోను ఏర్పరచి, సువార్త చెప్పే బోధకులను నిలువబెట్టుము.

7) ఆకాశమునుండి గొప్ప ధ్వని లోకమంతటికి, ఏక కాలమందు, ఒక గంటయైనను వినబడునట్లు చేయుము.

8) లోకములో నీకిష్టములేని దేవాలయములు, ప్రార్థనశాలలు, యెరికో గోడలు పడగొట్టినట్లు, మనుష్యులు చావకుండ పడిపోజేయుము. (యెహోషువ 6వ అధ్యాయము)

9) ప్రతి దేవాలయము మీద, నీ రాకడ సంగ్రహ వర్తమానము గాలిలో వ్రాయించుము.

10) ఒక ప్రత్యేక దినమున లోకములోనున్న మృగములు, పక్షులు, పశువులు; పగలు కట్టుకర్రలు విప్పుకొని, వీధులలో రంకెలు వేయునట్లు చేయుము. అలాగే గొర్రెలు, మేకలు ఇతర జంతువులు కూడ.

11) ఒక ప్రత్యేక దినమందు ఆకాశ పక్షులన్నియు, ఒక రాత్రి అంతా మాటు మణిగిన తరువాత, చెవులు గింగురు మనునంత ఎక్కువగా కూసేటట్లు చేయుము.

12) ఒక ప్రత్యేక దినమందు కప్పలు, పాములు, జెర్రులు, ఈగలు, దోమలు, తూనీగలు మొదలగు అన్ని రకములైన పురుగులు, ఉదయమున ఎండ సమయములో రోడ్లమీద, బాటలమీద నడిచి వెళ్ళిపోయేటట్లు చేయుము (ఎవ్వరికి హానిచేయకుండ).

13) ఒక ప్రత్యేక దినమున లోకములోయున్న ఆసుపత్రి రోగులు, ఇంటి రోగులు అకస్మాత్తుగా పగలు నడిచి, బైటికివచ్చి మరల ఇండ్లకు వెళ్ళిపోయేటట్లు చేయుము.

14) ఒకరోజు పగలు, రాత్రి అపరిమితమైన వర్షము, పిడుగులు, ఉరుములు కురిపించుము (నరులకు హాని రాకుండ).

15) మరియొక దినమున లోకములోనున్న నదులన్నియు, వాటి గట్ల మీదుగా ప్రవహించునట్లు ఒకగంట మాత్రమే చేయుము (మనుష్యులకు హానిలేకుండ).

16) ఒకానొక దినము లోకములోనున్న చెరువులు, నూతులు, పొరలిపోయేటట్లు చేయుము. ఒక గంట మాత్రమే (మనుష్యులకు హానిలేకుండ).

17) మరియొక దినమున లోకములోనున్న చెట్లన్నియు ఏక కాలములో కిర్రున మోతపెట్టి, నిన్ను స్తుతించునట్లు చేయుము.

18) ప్రతి గ్రామములో నున్న నేల పట్టపగలు ఒకగంట, మనుష్యులకు హాని లేకుండా వణికేటట్లు చేయుము.

19) మరొకనాడు సూర్యుని ఎండ, ఒకగంట మాత్రమే బహు వేండ్రముగా ప్రకాశింప జేయుము (మనుష్యులకు హానిలేకుండా).

20) ఒకనాడు భూమియందంతట ఒకగంట మంచు కురిపింప జేయుము (మనుష్యులకు హానిలేకుండా).

21) ఒకరాత్రి ఆకాశము నుండి చిత్తుచిత్తుగా ఉల్కలు జారిపడునట్లు చేయుము (మనుష్యులకు హానిలేకుండా)

22) ఒకనాడు అన్ని సముద్రములు వాటి హద్దుదాటి, ఒక ఫర్లాంగు దూరము పొర్లి వచ్చునట్లు చేయుము (మనుష్యులకు హానిలేకుండా).

23) లోకములోయున్న దయ్యములన్నియు, అందరికి తెలిసేటట్లు మధ్యరాత్రి వేళ గొల్లున గోల పెట్టునట్లు చేయుము (ఒకగంట మాత్రమే).

24) ఎవరినైనా ఒకరిని పంపి, నీ రాకయొక్క బొమ్మను కోట్లు కోట్లు అచ్చువేసి, అన్ని దేశములలో ఇచ్చేటట్లు చేయుము.

25) నీ భక్తులతో ఆయాభాషలలో రాకడ కీర్తనలు కట్టించుము.

26) బైబిలు మిషనువారు ఆదిలో పాడుకొన్నట్లు, ఇప్పుడును రాకడ కీర్తనలు పాడుకొనునట్లును, రాకడ వర్తమానములు ఇచ్చేటందుకు బూరలు వాడుకొనునట్లును ప్రేరేపించుము.

27) ఏయే మతములవారు ఏయే తప్పుడు సిద్ధాంతములు, ఏయే దురాచారములు కలిగియున్నారో, వారందరికి స్వప్నములోనో, దర్శనములోనో కనబడి వారి తప్పులు దిద్దుము.

28) ప్రతి మనిషికి నీవిచ్చిన జ్ఞానమునకు, మనస్సాక్షికి, నీవే స్వయముగా బోధించుము లేదా నీ భక్తులు చెప్పగా విన్న బోధలు నచ్చేటట్లు చేయుము.

29) ఏమిటీ గురుతులు? ఏమిటీ వింతలు? ఏమిటి ఈ క్రైస్తవులు 'రాకడ రాకడ' అంటున్నారు? అని ప్రతివారు రాకడ నిమిషము వరకు, రాకడను గురించి తమ మనస్సులో మరువకుండ తలంచుకొనేటట్లు చేయుము.

30) ఎప్పుడైన ఒకసారి మృతులైనవారు తమ బంధువులకు కనబడి, రాకడ విషయములు చెప్పేటట్లు చేయుము.

31) ఇప్పుడైనా పరలోక దూతలందరూ, రాకడ వర్తమానములు మనుష్యులందరికి చెప్పేటట్లు చేయుము.

32) కాకానిలో దయ్యముపట్టిన మనుష్యులను అడిగితే, యేసు ప్రభువే రక్షకుడని చెప్పుచున్నారు. అలాగే దయ్యములు కూడ తామున్న స్థలములలో నున్నవారికి, నిన్ను గూర్చి చెప్పేటట్లు చేయుము (సాక్ష్యమిచ్చేటట్లు చేయుము).

33) బిలాము యొక్క గార్ధభము బిలామును గద్దించెను. అలాగే నీ వాక్యము వినని వారియొక్క పశువులు, వారిని గద్దించేటట్లు నియమింపుము; పశువులకు వాక్కు యిమ్ము (సంఖ్యా. 22:28).

34) దేవా! నీవు భూమిని, ఆకాశమును, వాటిలోని సమస్తమును, దేవదూతలను కలుగజేసినావు గదా! ఈ నీ సృష్టి అంతటిని అనగా సృష్టిలో ఉన్న చిన్న, పెద్ద వస్తువులను వాడుకొనుటకు ఇదియే సమయము గనుక సృష్టి ద్వారా మనిషికి వర్తమానము అందించుము. అతని అనుచరులకు హడలు పుట్టించుము.

35) మొట్టమొదట మా కూటములకు, క్రమేణా తక్కిన కూటములకునూ ఈ అంశములు పంపేటందుకు సమయము, శక్తి దయచేయుము.

36) లోకములో అనగా నీవు కలుగజేసిన పరిశుద్ధ లోకములో, నేటివరకేది అపవిత్రముగానున్నదో అది ప్రతిమనిషికి జ్ఞాపకముచేసి, మా పాపముల వలననే గదా సాతానుకు లోబడుట, నీకు లోబడక పోవుటవలననే గదా, ఈ అపవిత్రత అని తెలిసికొని బుద్ధితెచ్చుకొనేటట్లు గద్దించుము. అపవిత్రత అనగా పాపరోగము, బంద, బాడి మొదలైనవి.

37) ఓ ప్రభువా! నీవు మాకు చెప్పిన సంగతులే లోకములోనున్న వారికందరికి, ముఖ్యముగా సన్నిధి కూటస్థులకు చెప్పుము. ఆమెన్.

38) దేవా! ఈ 37 అంశములలో నీకు ఇష్టము వచ్చిన అంశములకు జవాబు ఇమ్ము.

# రాకడ ప్రార్ధనలు

## 1వ ప్రార్ధన

మా పరలోకపు తండ్రీ! సంఘముయొక్క తండ్రీ! పరలోకముయొక్కయు దానిలో నున్న సంఘముయొక్కయు తండ్రివైన తండ్రీ! నీకు వందనములు. నీవు ఇంతమందికి తండ్రివి. నీ బిడ్డలు పరలోకములో పరిశుద్ధులై యున్నారు. భూలోకములో విశ్వాసులైన బిడ్డలు ఉన్నారు. నీ బిడ్డలు లేని స్థలములేదు. పాతాళ లోకములోకూడ తయారగుచున్న నీ బిడ్డలున్నారు. నీ బిడ్డలులేని స్థలములేదు. మోక్షముయొక్క పరిశుద్ధులు కాక, ఇప్పుడును పరలోకమునకు సిద్ధపడుచున్న పరిశుద్ధులుకాక, ఊర్ధ్వ లోకమందు సిద్ధపడుచున్నవారును నీ బిడ్డలే, కాబట్టి నీకు వందనములు. అయితే ఇంతమందికి నీవు తండ్రివై యున్నావనే సంగతి అందరికి తెలియదు, తెలిసిన వారికి ఈ సిద్ధి కలదు.

ఓ తండ్రీ! నీవు తండ్రివని ఎవరైతే తెలిసికొని, విశ్వసించి, ప్రేమించుచున్నారో, వారు మరొక విషయము తెలిసికొనుచున్నారు. వారును, మేమును ఆ తండ్రి బిడ్డలమై యున్నాము. దేవదూతలెంతో, మోక్ష లోకములోని వారెంతో, భూమిమీద తయారగుచున్న మేమును అంతే. అయితే విశ్వాసులైనవారి నిమిత్తము మేము కనిపెట్టుచున్నాము. ముఖ్యముగా వధువు సంఘమెప్పుడు తయారగునో ఆ మహిమ మతాభీవలె, సూర్య కాంతివలె, నేను తెలిసికొన్న కాంతివలెకాదు, మేము ఎవ్వరము

ఎప్పుడు చూడలేని మహిమ కాంతిలో, పరలోకములోనున్న ఆఖరు సంఘముతో కలిసికొన్నప్పుడు, నీ మహిమ, నీ శక్తి తెలిసికొందుము. 'ఆయన మహిమ అంటే ఇది, ఆయన శక్తి అంటే ఇది, అది భూలోకములో నుండగా తెలిసికొన్నదికాదు అని ఇక్కడ గ్రహింపలేని సంతోషముతో అక్కడ సంతోషింతుము. ఇక్కడ గ్రహింప లేని, మా సంతోషము కొంచెమే. మేము ఆ మహిమను గ్రహించుటకై, ఈ లోకపు మహిమను మరచిపోయే కృప దయచేయుము.

తండ్రివైన ప్రభువా! రక్షకుడవైన ప్రభువా! ఆదరణకర్తవైన ప్రభువా! ముగ్గురు తండ్రులుకాక ఒక్క తండ్రివై యున్న తండ్రీ! నీ కనేక స్తోత్రములు. మేము నీ బిడ్డలమని మహా ధైర్యముతో, సంపూర్ణమైన శైలితో ఇప్పుడు అనలేము. దయగలతండ్రీ! మమ్ములను దుఃఖములోనికి, నిరాశలోనికి దింపే ఒక్కమాట ఇదివరకే బైలుపర్చినావు. మహా ప్రేమగలమాట, మాకర్థముకాని మాట తెలియపర్చినావు. అది ఏమిటంటే "భూలోకములో నున్న ప్రతిమనిషితో మిక్కిలి స్పష్టముగా మాట్లాడవలెనని నాకు ఉన్నది" అని అన్నావు. ప్రభువా! ఏమి గ్రహింపగలము! భక్తులతోనే పూర్తిగా మాట్లాడుట లేదు. మిక్కిలి తరచుగాకూడా మాట్లాడుటలేదు. ఇది మేము ఎట్లు గ్రహింపగలము! నీవు అలాగు మాట్లాడక పోవుటకు మేమే ఆటంకము. ఈ మహాగొప్ప ప్రేమ, దాగియున్న నీ ప్రేమ, నీ నామము ధరించిన సంఘమంతటికిని, అలాగే లోకములోనున్న అవిశ్వాసులందరకును ఈ సంగతి ఎప్పుడు బైలుపడును? ఒకవేళ మేము చెప్పినా వారు నమ్మరు. గ్రహింపను గ్రహింపరు, నమ్మను నమ్మరు. అయితే ప్రభువా! ప్రకటన చివరి భాగములో అప్పుడు అందరితో ఒక్కసారే మాట్లాడుదువు అని ఉన్నది. అప్పుడు అందరికి వినబడునుగాని, అందరూ మార్పు పొందరుగదా! ఇప్పుడు మాత్రము వినబడితే మార్పు పొందుదురా? నా చెవి 'ఓరు' పెడుతున్నదని అనుకొంటారు గాని ప్రభువు మాట్లాడుచున్నాడని అనుకొనరు. తండ్రి చెప్పినాడని వారనుకొనరు. కాని బెదిరి, బెదిరి చూస్తారు. కొందరు భక్తులు, "ఏదో దేవత మాట్లాడుతుంది, బయటకు వెళ్ళవద్దు తలుపు వేసుకొనండి" అంటారు. మనిషి తన హృదయమును ఇంతగా కఠినము చేసికొన్నాడు. అయినను ప్రభువా! నీవు తండ్రివి గనుక ప్రేమించడము మాత్రము మానలేదు. కాబట్టి నీ కనేక వందనములు.

మా ప్రభువా! ముఖ్యముగా గత 30 సం॥ల నుండి ఈ సంగతి వింటున్న వారిలో ఎవరైనా ఒకరు అనుదినము, మిక్కిలి తరచుగా నీ స్వరము వినేటట్లు సిద్ధముకాగలిగిన యెడల మాకెంత సంతోషము! అట్టి సమయము ఎప్పుడు వచ్చును? అట్టి వ్యక్తి ఎప్పుడు వచ్చును? మా ప్రభువా! ఇప్పుడనేకమంది కొద్దిగా నీ స్వరము వింటున్నారు సంతోషమే గాని ఎవరూ పూర్తిగా వినలేక పోతున్నారు, అదే విచారము. గనుక తరచుగా మేము ఈ ప్రకారము కూడుకొన్న క్రమేణ ఆ స్థితిలోనికి రాగలము (దేవుని స్వరము వినే స్థితి). లోకాధికారులు పాఠశాలలకైనా సెలవిస్తారు గాని నీ స్వరం వినడానికి మా శరీరము, మా స్వజనులు, మా పని, మా బలహీనత సెలవియ్యదు. ఓ తండ్రీ! మేము నీతో మాట్లాడే విషయములు చాల ఉన్నవి గాని తరుణము లేదు 24 గంటల సమయమున్నను, మేమందుకొనే తరుణము లేదు సమయములేదు. క్షమించుమని త్వరగా రానైయున్న యేసు ప్రభువు ద్వారా వేడుకొనుచున్నాము. ఆమెన్.

## 2వ ప్రార్థన

ఓ దయగల తండ్రీ! సమస్తము నీయందు గుప్తములైయున్నవి గనుక నిన్ను గురించి తెలిసికొంటే అన్నిటిని తెలిసికొనగలము. అందుచేత దైవభక్తులు నిన్ను 'ప్రత్యక్షత' అన్నారు గనుక తండ్రిని, కుమారుని, పరిశుద్ధాత్మను గురించిన సంగతి మేము పూర్తిగా తెలిసికొనవలెను. సమస్తమును నీయందు గుప్తములైయున్నవి. మేము నీకు నమస్కారము చేసిన యెడల మిగిలినవన్నిటికి చేసినట్లే. 'నన్ను చూస్తే' తండ్రిని చూసినట్లే' అని చెప్పినావు. ఎందుకంటే అన్నీ నీయందు గుప్తములైయున్నవి. గనుక ఒక గంటసేపు ధ్యానములో నున్న యెడల పొందవలసిన స్థితి పొందగలము. ధ్యానమువలన మా ప్రార్థన, మా వాక్యము ఉద్రేకముగా ఉండగలవు. అట్టిది లేకుండా యుంటే సమస్తము వ్యర్థము. కొన్ని చప్పగాను, కొన్ని మహా ఉద్రేకముగాను ఉన్నవని కూటములను గురించి చెప్పుదురు. గనుక ఏ కూటములోనైనను ప్రతిదినము నూతన విషయములను తెలిసికొనవలెను. ఆ దిన కూటములు ఏవైనా సరే, ఈ దినము సమాజము ఏరీతిగా నున్నదని ప్రశ్నించు కొనవలెను. అప్పుడు పరలోక కూటస్తులవలె

మనమును ఉద్రేకముగా నుందుము. నిన్ను తలంచుకొనుట, నీ చిత్తమంతయు తలంచుకొనుటే, ఎందుకనగా సమస్తము నీయందు గుప్తములైయున్నవి. గనుక ప్రభువా! నీకు వందనములు. ప్రభువైన యేసూ! పరిశుద్ధాత్మా! తండ్రిలోనివన్నీ తీసికొని మాకు బోధపర్చుచున్నారు గనుక ప్రభువా మీకనేక వందనములు. అంతియొకయ సంఘస్తులు కూటములుగా కూడినారు. నామకార్థముగా కాక ఉత్సాహముగా, భక్తితో, విశ్వాసముతో, సంతోషముతో కూడిక చేసికొన్నారు. అన్యుల పట్టణములో భక్తులను లేపినావు, నీకు వందనములు. నీవు వారికి ప్రత్యక్షమై ఒకమాట అన్నావు. ఆ మాట క్రొత్త నిబంధనలోనున్న అపోస్తలుల కార్యములు మొదలు, పౌలు వ్రాసిన పత్రికలయొక్క చివరిమాట వరకు నెరవేరినది. ఎంత ఆశ్చర్యము! యెరూషలేములో మాట్లాడినావు. ఖైదులోకి కూడవెళ్ళి ప్రత్యక్షుడవైనావు, నీకు వందనములు. ఒక గొప్ప మాట అన్నావు, “ఓ సంఘమా! ఆత్మ మీతో ఏమి చెప్పునో ఆ మాట వినవలెను”. మేము ఏ కూటము జరుపుకొన్ననూ, తండ్రి, కుమార, పరిశుద్ధాత్ముడవైన తండ్రీ! నీ పునరుత్థానమును నేటివరకు తలంచుకొనుచున్న యెడల మా కూటము బలపడ గలదు. మేము, మాకు తెలియకుండనే ప్రక్కబడిపోదుము. మేడగట్టిదైతే, వరద ప్రక్కబడి పోవును. ఒక ప్రక్కను ‘ప్రభువు రాకడ ప్రభువు రాకడ’, ఇంకొక ప్రక్క ‘ఇప్పుడెక్కడ ఇప్పుడెక్కడ’, ఈ రెంటిమధ్య మేమున్నాము గాన ఇప్పుడెక్కడ అనే సందేహముండరాదు. ఓ తండ్రీ! మేము రెండు ప్రవాహముల మధ్య నున్నాము. ఒక ప్రవాహము కుడివైపు, మరియొక ప్రవాహము ఎడమవైపు ఆనకట్టమీద ప్రవహించినపుడు ఒకధ్వని, ఇంటిమీద ప్రవహించి నపుడు మరియొక ధ్వని వినబడుచున్నది గాని మంచినీటి ప్రవాహధ్వని వినబడదు. నీ దీవెన అందరికి దయచేయుము. మా కూటస్తులు నీ సంగతులు ఇదివరకే నేర్చుకొనవలెను. తండ్రీ, కుమార, పరిశుద్ధాత్మల పనులు మేము క్రొత్తవిగా నేర్చుకొనవలెను. ప్రభువా! నీ రాకడ, తండ్రి రాకడను గూర్చి మేము నేర్చుకొనవలెను. ఆ నీ రాకడను గ్రహింపగలిగే కృప మాకు దయచేయుము. ఈ కథ మా తలకెక్కదు. చివరి దినములలో ‘అనేకమంది ప్రేమ చల్లారిపోవును’ గనుక ఆ వాక్యము మాయందు

నెరవేరకుండా ఉండే కృప దయచేయుమని, కాపాడుమని అడుగుచున్నాము. విశ్వాసముండునా? అని తలంచుకుంటే బల్లెపుపోటు. ఎన్ని పర్యాయములు ఎన్ని మీటింగులు పెట్టుకొన్ననూ, అన్ని పర్యాయములూ, 'ప్రభువైన యేసూ! త్వరగా రమ్ము' అను ప్రార్ధన చేయగలిగే గొప్ప కృప కలిగించుమని వేడుకొనుచున్నాము. త్రియేక దేవుడవైన తండ్రీ! మా క్రైస్తవ జీవిత అనుభవము ప్రారంభమైనది మొదలు ఎన్ని వందనములు చెల్లించవలెనో, అన్ని వందనములు చెల్లించుచున్నాము. త్వరగా రానైయున్న యేసుప్రభువు ద్వారా ఈ ప్రార్ధనలు అంగీకరించుము. ఆమెన్.

షరా: ఈ ప్రార్ధనవిని పౌరుషము, ఉద్రేకము గలవారై ఎన్ని ప్రార్ధనలు చేసికొనిననూ, ముగింపులో 'త్వరగా వచ్చుచున్న నీ రాకడకు సిద్ధపర్చుము' అని అనవలెను.

## 3వ ప్రార్ధన

త్రియేక తండ్రీ! ఓ తండ్రీ! ఓ దేవా! ఓ ప్రభువా! సర్వాధికారీ! సమస్త సృష్టికి కర్తవైన ప్రభువా! నీ మహాగొప్ప మహిమ ఎదుట పాపులమైన మేము ఈ దినమందు కూర్చుండి, నీ యొక్క రెండవ రాకడ ధ్యానము చేయనైయున్నాము గనుక ముందుగా నిన్ను స్తుతించు చున్నాము. ఈ సమావేశము నిమిత్తము నిన్ను స్తుతించుచున్నాము. ఓ దేవా! నీవు కలుగజేసిన సూర్య, చంద్ర, నక్షత్రముల కాంతి ఈ వధువు సంఘము చూచినప్పుడు, ఇవే ఇంత కాంతిగాయుంటే నీవు ఇంకా ఎంత కాంతిగా యుందువో అనే తలంపుతో ఆనందించే కృపదయచేయుము. మేము ఎప్పుడు పరలోకమునకు వెళ్ళి, ఆయన కాంతిలో, ఆ మహిమ కాంతిలో, జ్యోతుల కాంతికి మించిన కాంతిలో నుందుమో అని ఆశించే కృప వధువు సంఘమునకు దయచేయుము. పై మహిమ తలంపు, ఆకాశమండల మహిమ మా కన్నులయెదుట చూపిస్తున్నావు. నీకు మా వందనములు. మేము జన్మించినది మొదలు జీవాంతము వరకు ఆకాశ మహిమకాంతిని చూపించుచు, నీ కాంతిని జ్ఞాపకము చేస్తున్నావు గనుక నీకు వందనములు. నరులు నీ సంగతులు తెలుసుకొనవలెనంటే బోధకులకన్న, గ్రంథములకన్న ముందుగా జ్యోతులే తెలియ పర్చుచున్నవి. గనుక నీకు వందనములు. మా నిమిత్తమై జ్యోతుల దగ్గరనుండి వచ్చుచున్న కాంతిని, వాటి క్రిందనున్న మేఘములలో మా దాహశాంతి నిమిత్తమై,

మా స్నానము నిమిత్తమై నీవు దాచి పెట్టిన జలమును చూడగా, మేము పరలోకమునకు వచ్చి, సమరయ స్త్రీకి సుఖారు నూతివద్ద నీవు చెప్పిన జీవజలమును, ఎప్పుడు పానము చేయుదుమో అనే తలంపుతో నిన్ను స్తుతించు కృప  వధువు సంఘమునకు దయచేయుము. మాకంటే తక్కువగా నిన్ను గురించి తెలిసియున్న పక్ష్యాదులయొక్క ఉదయకాల గానము విని, మేము ఎప్పుడు పరలోకమునకు వెళ్ళి స్తుతిగానము, ఆగని స్తుతిగానము, భూలోక మెరుగని స్తుతిగానము, నూతన గానము, భక్తుల గానము నందుకొనుము! అనే ఆతురతతో కనిపెట్టగల నిత్యాశను వధువు కలిగియుండునట్లు నీ కృప దయచేయుము. ఇట్టి జ్ఞానశక్తి నిమిత్తము నీకు వందనములు. ఇంకను దిగువకురాగా, పాపముతో నిండియున్న ఈ భూమిమీద మొలిచిన చెట్లకు ఎంతో రమ్యమైన పువ్వులు, పండ్లున్నవి. పాపము లేనప్పుడు ఏదెనుతోటలోని పూలు, పండ్లు ఎట్లుండెనోయని, పరలోకములోనికి వచ్చునప్పుడు వాటిని చూచే ఆశ వధువునకు దయచేయుము. అట్లు స్తుతి చేయుటకు ఇవి ముంగుర్తులైయున్నవి. ఎంత పాపము వ్యాపించినను, సృష్టి ఇంత రమ్యత గలిగి యుంటే, మా తండ్రీ! పరలోకములో మేము, మా వస్త్రధారణ, దేవదూతలు, ఎంత రమ్యముగా నుందుమోయని మరెక్కువగా స్తుతించే కృప మాకు దయచేయుము. ఇట్టి తలంపు నిమిత్తమై నీకు మా వందనములు. పాపముతో నిండిన ఈ లోకములో కొందరు బోధకులను, ఏర్పర్చి నీ వాక్యము వివరిస్తుండగా వింటూయున్న వధువు సంఘమునకు, ఒక మంచి తలంపు కలిగించుము. ఇక్కడి బోధకులే ఇంతగా వినిపిస్తే, పాపములేని ఆ పరలోకములో ఇంకా ఎంత వినసొంపుగా ఉండునో అనే తలంపు వధువు సంఘమునకు దయచేయుము. అట్టి జ్ఞాపకమును కలుగజేసే తండ్రీ! నీకు మా నిత్యమంగళ స్తోత్రములు. పరలోకములో మా స్వజనులు, మాకు బోధించిన వారు, మా బోధవిని మారినవారు, మా పాత నిబంధనలోనివారు, మా క్రొత్తనిబంధనలోని వారు, మా సంఘచరిత్రలోని వారు, మా మిషను వారు, మేము ఎన్నడును అనుకొనని పరమ దుర్మార్గులు, పరమ భక్తులు మున్నగు వారిని మేము కలిసికొనే ఆతురత కొరకు నీ కృప దయచేయుము.

ఈ రమణీయ ఆలోచన నిమిత్తమై నీకు వందనములు. కొంతవరకు ఇక్కడ దర్శనములో చూస్తున్నాము. మాకు తృప్తిలేదు. నిన్ను ముఖాముఖిగా చూచు భాగ్యము దయచేయుము. అప్పుడు మాకు పాడు లోకము, పాడు తలంపులు, పాడు మాటలు, పాడు క్రియలు, పాప సమూహము మా జ్ఞాపకమునకు రావు. అట్టి స్థితి అక్కడయున్నది. గనుక మేము త్వరలో వెళ్ళిపోవలెను. త్వరగా వస్తానన్న ప్రభువు త్వరగా వస్తుంటే, మేముకూడ త్వరగా వస్తున్నాము యని అనుకొనే కృప దయచేయుము. చివరలో పాపులమధ్య, సుంకరులమధ్య కూర్చుండి భుజించియున్న మా ప్రభువువలె, నేడు పాపులమధ్య సుంకరుల మధ్యనున్న వధువుసంఘము యొక్క ఈ సంతోషము, ఈ నిరీక్షణ, ఈ సమావేశములు, ఈ బోధలు, ఈ జ్ఞానము – మా చుట్టునున్న వారు చూస్తుండగా వధువు సంఘములోనికి త్వరగా వచ్చేటట్లు వారికెక్కువ ప్రేరేపణ దయచేయగల ప్రభువా! అట్టి ఘనకార్యము నీవు చేస్తుండగా, ఎన్నాళ్ళకో నీవు కూడ వధువు సంఘములోనికి వచ్చావా? అని హస్త పరిచయము (Shakehand) చేసికొనే కృపా తరుణము దయచేయుమని వేడుకొనుచున్నాము. ఈ నూతన సంకల్పన నిమిత్తము నీకు వందనములు. నీ సన్నిధిలో నున్నాము అవసరమైనవి అందించుమని వేడుకొనుచున్నాము. ఆమెన్.

షరా: 365 దినములుకూడా రాకడను గురించి ధ్యానింపవలెననిన యెడల, 370 సార్లు రాకడను గూర్చి క్రొత్త నిబంధనలో ఉన్నది. గనుక ఆ రాకడ వాక్యములు ప్రతిదినము చదివిన యెడల రాకడ కాంతి మీలో వెలిగింపబడును. అవి చదివినకొలదీ, అందులోనుండి నూతనమైన కాంతి మీకు కనబడగలదు.

## ***యేసు ప్రభువు 3 మందలింపులు, 2 సలహాలు చెప్పెను.***

(లూకా 21:34-36)లో తిండి, మత్తు, ఐహిక విచారము అను 3 మందస్థితులు ఉన్నవి.

**1. తిండి:** తిండిమీద పడిపోయి పరలోకమునకు సిద్ధపడు విషయములో అశ్రద్ధగా నుందురు. రాకడ విశ్వాసులకు ప్రభువు ఈ మాట చెప్పుచున్నారు. ఈ విషయములో ఎవరైనా నేరస్థులైయుందురేమో జాగ్రత్తగా చూచుకొనండి, పరీక్షించు కొనండి. పెండ్లికుమార్తె సిద్ధబాటును జ్ఞాపకము చేసికొని, భోజనము చేయునప్పుడు ఈ మందలింపు మాటను జ్ఞాపకముంచు కొనండి. ఒక ముద్ద తక్కువగా తినమని

డాక్టర్లు చెప్పెదరు. ఎక్కువగా తింటే ఎక్కువ బలమనుకొంటారు, గాని రెండు ముద్దలు తగ్గించి తినిన మంచిది.

**2. మత్తు :** అలసట వలన, త్రాగడంవలన మత్తు రావచ్చును. ఏవిధమైన మత్తయినను సరే, సిద్ధపడుటకు ఆటంకమే గనుక మత్తును రద్దుచేయుము. ఇప్పుడిప్పుడే కాదు అనుకొని నిద్రపోయినవారు (బుద్ధిలేని కన్యకలు). వారు భక్తి ఎక్కువైపోయి నిద్ర పోయినారు గనుక రాకడ ఇప్పుడిప్పుడే రాదు అనేది చేదస్తము. 30–35 ఏండ్లనుండి రాకడ వస్తున్నదని చెప్పుచున్నారు, ఇంకా రాలేదు గనుక రాకడ అప్పుడే రాదు అంటే విశ్వాసులు ఊరుకొంటారు. ఈలాగు మత్తు రావడమునకు అనేక కారణములుండును గనుక అది రాకుండా చూచుకొనండి.

**3. ఐహిక విచారము :** ఈ లోకసంబంధమైన చింత కుటుంబములో ఆరంభ మగును. భార్య, భర్తలు కీచులాడుట, పరలోక విచారము, చింత, పెనిమిటికి ఇంకా మారుమనస్సు రాలేదనే చింత. ఈ విధమైన చింతలు కలిగి ఉండుట, పైనుండి వచ్చే జలము భూమిమీద బురదతో కలిసి చెడినట్లు ఉండును. పిల్లలు చెప్పేమాట వినరు. ఈ చింతలు మనకు ఉండరాదు, ఆత్మకు కళంకము కలుగనియ్యరాదు. చింత పెట్టుకొంటే రాకడలో వెళ్ళలేరు. ప్రభువు యుక్తకాలమందు వారిని మార్చును. 'చింతించితే మూరెడు పొడుగగుదురా'? అను వాక్యమును జ్ఞాపకము చేసికొని, 'నేను బోధించినాను, ప్రార్థిస్తాను' అని అనుకొనవలెను. కుటుంబములో మాత్రమేకాదు, సంఘములో కూడ చింత ఉండును, మారుమనస్సు పొందని వారిగురించే ఉండును. గనుక బోధించుట, ప్రార్థనచేయుట, ఉత్తరము వ్రాయుట మానవద్దు. శ్రద్ధతో వినేవారు స్థిరులు, ముప్పదంతలు. వ్రాసికొనేవారు అంతకంటే స్థిరులు, అరువదంతలు. వీరికంటే స్థిరులు ఇతరులకు చెప్పేవారు, వారు నూరంతలు. గనుక వినిన ప్రకారము చెయ్యవలెను. 1) విశ్వాసము, 2) విశ్వాసముతో కూడిన క్రియ, 3) క్రియతోకూడిన విశ్వాసము. ఆసమయము కొరకు కనిపెట్టుకొనక పోయినందవల్లనే ఆ కన్యకలు వెళ్ళలేకపోయిరి. యేసు ప్రభువు ఆ గడియ, ఆ దినము తెలియదని, ఇప్పుడే రాదని ఎంత చెప్పినను, పెండ్లికుమార్తె ఆ గడియ ఏదో, ఆ దినము ఏదో, ఆ సంవత్సరము ఏదోయని ముఖ్యముగా కనిపెట్టవలెను.

**సైమల్ టేనియస్** (ఏక కాలము): ఆ ఏక కాలము ఏ కాలము? రెప్పపాటు కాలము. పై మూడు అనగా తిండి, మత్తు, ఐహిక విచారము. ఈ మూడు కూడనివి. ఏరగా ఏరగా, ప్రభువు ఈ మూడు ఏరినాడు. ఇవి పాపములుకావు గాని అజాగ్రత్తకు సంబంధించినవి. జాగ్రత్త నిమిత్తము ప్రభువు వీటిని ముందుగా చెప్పెను. పాపము చేయుటలో జాగ్రత్తగా నుందురు గాని ఈ 3 విషయములో మందముగా నుందురు.

**సలహాలు:** 1) ఎల్లప్పుడు ప్రార్థన చేయుట, 2) మెళకువగా నుండుట. మెళకువగా నుండుట అనగా నిద్రలేకుండ నుండుటకాదు. నిద్ర పోతున్నను సరే రాకడ తలంపుతో హుషారుగా నుండుట. డాక్టరు మార్టిను లూథర్‌గారు "నా ఆత్మను నీ చేతికి అప్పగించుచున్నానని" ప్రతి రాత్రి, చివరి ప్రార్థన చేసి నిద్రపోయేవారు. అప్పుడు నిద్రపోయినా మెళుకువగా నున్నట్లే. ఇంకనూ, పెండ్లికుమార్తె చేసే ప్రార్థన ఏమైనా నున్నదా? ఉన్నది. 'ప్రభువైన యేసూ రమ్ము' అనే ప్రార్థన. ఈ ప్రార్థన ఎందుకు? ఇది అన్నిటికన్నా ముఖ్యమైనది. ఆదామవ్వలను సైతాను మోసము చేసెను. అప్పుడు సైతానును బంధించెనా? లేదు. అయితే వాడు ఒకనాడు పాపముచేస్తే, చిరకాలము వైరము ఎందుకు? (ఆది 3:15) అది బంధము. సైతానుకు విమోచనలేదు. అది నిత్య బంధకమే. మట్టి తింటావు, నేలను ప్రాకుతావు, నిత్యము బంధకమే, సాతానుకు శిక్షే గాని రక్షణలేదు. ఇది ప్రభువు మాకు బైలుపర్చిన వ్యాఖ్యానము. మనకు శిక్షయున్న రక్షణయున్నది. సాతాను చిత్తుచేయబడిన శత్రువు, ఆదాము దగ్గరే వాడు ఓడిపోయినాడు. గనుక దేనికిని మనము భయపడనక్కరలేదు, చింతపడ నక్కరలేదు. ఆరు నరుని సంఖ్య, ఏడు దేవుని సంఖ్య. సైతానుకు పూర్తిగా బంధనకాదు. ఆదామవ్వలు పైన, క్రింద సైతాను జడ్జికోర్టులో బంధనలో యున్నారు. గాని అతనిలో విషమున్నది. ఉదాహరణకు పొడ పామున్నది. అది ఊదినది, వెళ్లిపోయింది గాని దాని గాలి, దాని విషము మనిషి మీద ఉండును కదా! అలాగే సాతాను ఊదిన విషముయొక్క వేరున్నది. ఆ విషము కయీనులోనికి వచ్చి, దేవుడు చెప్పినమాట అబద్ధమని చెప్పెను. హేబెలు చనిపోయెను. ఆ విషము అక్కడనుండి జలప్రళయ కాలమునకు వచ్చి, ఓడను ఎక్కనివ్వలేదు. అక్కడనుండి మన కాలము వరకు, ఆ తర్వాత

7 ఏండ్లు, వెయ్యి ఏండ్లవరకు వచ్చెను. చివరగా, ఆ వెయ్యేండ్ల తర్వాత దేవుడు, చెరలోనున్న సాతానుకు ఎందుకు విడుదల ఇచ్చెను? మారని మనుషులున్నందున విడుదల ఇచ్చెను. వీరు పిలిచిన పిలుపున్నది, వారు "నీవు ఊదిన విషము మాలో ఉన్నదని సైతానును కోరుకొందురు". కోరేవారు లేకపోయిన దేవుడు సాతానును ఆ పైనే నరకములోనికి పంపివేయును. మనుష్యులు ఎందుకు కోరుకొన్నారంటే, దానిలోని విషము వారిలో నున్నందున వారు కోరుకొన్నారు. పాపముచేసే వారందరూ సాతానును కోరుకొన్నట్లే. ఇప్పుడున్న పాపాత్ములందరు ఒక తెల్లని కాగితముపై, ఈ సాతానుమీద అర్జి వ్రాసి, పెండ్లికుమార్తెతో సంతకము చేయించిన, అప్పుడు పెండ్లికుమార్తె సింహాసనము దగ్గరనున్న విజ్ఞాపనకర్తకు దానిని అందించగా, తండ్రి శాంక్షను (Sanction) చేయును. వెంటనే సాతాను పనికి ముగింపు అగును. ఇది వెంటనే జరుగదని మాకు తెలుసు గాని జరిగిన బాగుండును. విశ్వాసులు అర్జీ ఇచ్చుకొంటున్నారు. గనుక సాతానును బంధించుము. ఓ ప్రభువా! విశ్వాసులెవ్వరూ సాతాను చేతిలో పడకుండ చేయుము. ఈ మా ప్రార్ధనలు, వాక్యములన్నియు త్వరగా రానైయున్న యేసుప్రభువు ద్వారా అంగీకరించుము. ఆమెన్.

## 4వ ప్రార్ధన

తండ్రీ! నీ కుమారునిద్వారా ఇచ్చిన సమస్త వాక్యము నిమిత్తమై వందనములు. నీవు ఒకప్పుడు మేము, మా పూర్వికులు పుట్టకముందు నరులకు ఇవ్వడము ఆరంభించి, నేటివరకు నీ గుప్పిలి విప్పియే యుంచినావు, ఇంకా ఇచ్చుచున్నావు. ఇది నీ కృప. ఇంకనూ, వెయ్యేండ్లలో ఇవ్వనైయున్నావు ఇది నీ దాన కృప. ఇప్పుడు మాలో కొందరు ఇబ్బంది పడుచున్నారు కొందరు వస్త్రములకు, మరికొందరు సొమ్ముకు ఇబ్బంది పడుచున్నారు. నీ కుమారుడు రెండవసారి రానైయున్నప్పుడు, అది నీతి సూర్యుడుదయించే యుదయమై యుండునని మాకు తెలియును. ఆ ఉదయమే వచ్చినయెడల ఇక రాత్రి చూడనే చూడము. చీకటిలేని ఆ దేశమునకు మమ్మును తీసుకొని వెళ్ళెదవు. ఉదయమైన తరువాత ఇక ఎప్పుడును పగలే. అట్టి దేశమునకు వెళ్ళనైయుంటే ఇంకను చీకటి పనులు, చీకటి కార్యములు ఎందుకు? ఇది మా కృపాసమయము గనుక మాలో ఎవ్వరి

ఇంటివద్ద చీకటి కార్యములున్నవో, వాటిని మానివేయు కృప దయచేయుము. పాపాంధ కారమునకును, మాకును ఎట్టి పరిచయము లేకుండాచేసి నీ కృప మాకు అనుగ్రహించుము. మా క్రియలు, మా మాటలు వినేవారున్నారు. మా వంకర చూపులు గ్రుడ్డి చూపులు, అసూయ చూపులు, పాపపు చూపులు చూచేవారున్నారు. గాని మా హృదయములోని చెడుగును చూచేవారు లేరు. అలాగు చూచేవాడవు నీవు ఒక్కడవే యున్నావు. 'నేను సజీవుల గుంపులో నున్నాను' అని చెప్పుకొను నీ రాకడ గుంపులోని వారి హృదయము లోపల, ఏ ఒక్క చెడుగున్నదో నీవు పరీక్షించి, దానికి వారు గడగడ వణికే కృప దయచేయుము. డాక్టర్లు టి.బి. అనే (క్షయ) వ్యాధిగల వానితో, నీకు ఏ జబ్బులేదు అనవచ్చునుగాని, మా హృదయములో ఏలాంటి (చెడు) తలంపు లేదనుకొనువారి హృదయములోనికి నీవు తొంగిచూచి, నీవేల సజీవుల గుంపులోనికి వెళ్ళగలవు? ఏలాగు పెండ్లికుమార్తె సంఘములోనికి వెళ్ళగలవు? అని మనస్సాక్షి ద్వారా అడిగిన యెడల, మేము సిద్ధపడగలము. మాలో ఏ తప్పులేదని మరణించుట కంటే, మాలో ఈ తప్పున్నదని అరచుట మంచిది.

ఈ పాఠములను నేర్చుకొనిన తరువాతకూడ, ఇంకనూ మాలో కళంకములుంటే ఏమి లాభము? గనుక మాలో ఏ మూలనైనను కళంకమనునది లేకుండ రూపుమాపుము. మాకు తెలియనిది తెలియపరచుమని బ్రతిమాలు కొనుచున్నాము. ఈ వేళ నేను భక్తిగా యుండవచ్చును, అయితే చనిపోవునప్పటికి, ఇంత భక్తి, ఇంత శ్రద్ధ యుండునా? అని ప్రశ్నించుకొనవలెను. నీ రాకడ కనుక ఎవరిమట్టుకు వారే తలవంచుకొని సిగ్గుపడి, తండ్రీ! యని ఒప్పుకొనే కృప దయచేయుము.

నీ రాకడ మేఘమెక్కు పర్యంతము, మేము మహా పవిత్రముగా యుండేటట్లు ఆశీర్వదించుమని వేడుకొనుచున్నాము. మాలో ఏమైన తప్పున్నదేమో, అనే భాష మాకు అక్కర లేదు, ఉన్నది అనే భాష దయచేయుము. దయగల ప్రభువా! నీవు కృపగలవాడవని అనేకమంది లోకువగట్టు చున్నారు, నీవు క్షమించేవాడవని చాటున పాపములు చేయుచున్నారు. తల్లి, ఎక్కువ గారాబముగా

చూచినయెడల పిల్లలు మాటవినరు. కొందరు నీ కృపను, నిన్ను, నీ వాక్యము బోధించేవారిని లోకువ గట్టినారు. మేమట్టివారము గాకుండ చేయుము. శోధనలు రాకుండమానవు గనుక వాటిని జయించే దైవశక్తి అనుగ్రహింపుము.

విశ్వాసులనోట సజీవులగుంపు, రెండవరాకడ, పెండ్లికుమార్తె, సంఘవరుస మేఘ నివాసము, పరలోకపు విందు ఈ మాటలేయున్నవి, అనగా ఆశయున్నదిగాని క్రియలేదు. మేమట్టివారమై యుండక, జాగ్రత్తగా యుండే కృప దయచేయుము, వందనములు. కొందరు ఎంత ప్రేమతో చెప్పినను మారరు, మారలేదు. అన్ని విడిచిపెట్టి, ఒక్కటి విడిచిపెట్టక పోయిన యెడల లాభము లేదు. పెండ్లికుమార్తె, సజీవులగుంపు, రెండవ రాకడయని అనవసరముగా అనడము ఎందుకు? ఈ మూడును వ్యర్ధముగా నుచ్చరించువారు దోషులగుదురు, కళంకమును అనుకొనువారును దోషులై యుందురని మాకు నేర్పుము. నీ కృప మాకు ఇక్కడ అందేటట్లు ఆశీర్వదింపుమని వేడుకొనుచున్నాము. ఆమెన్. మరనాత.

షరా: దేవదాసు అయ్యగారి ఉపదేశముల నోట్సునుండి ఈ ప్రార్ధనలు వ్రాసి ఇచ్చిన శ్రీమతి. పి. జె. గ్రేసమ్మ (విజయవాడ) గారికి మా హృదయ పూర్వక వందనములు.

**రెవ. డా॥ యన్. సత్యానందం**
**ప్రసిడెంట్, బైబిలు మిషను**

Bible Mission HQ Guntur

# బైబిలు మిషను వారును, రాకడ విశ్వాసులును చేయవలసిన ప్రమాణములు

1) సంఘారోహణమునకు సిద్ధపడుదునని త్రిత్వదేవుని ఎదుటను, పరిశుద్ధులందరి ఎదుటను, దైవజనుని ఎదుటను నేను ప్రమాణము చేయుచున్నాను.

2) సంఘారోహణము త్వరలో జరగనైయున్నదని నమ్ముచు ప్రమాణము చేయుచున్నాను.

3) బైబిలు మిషను సిద్ధాంతములకు పూర్తిగా లోబడుదునని వాగ్దానము చేయుచు ప్రమాణము చేయుచున్నాను.

4) సంఘారోహణ వృద్ధికి ప్రయాసపడుచు, నా పనిని, నా జీవితమును వాడుదునని ప్రమాణము చేయుచున్నాను.

5) శ్రమ, కరవు, ఖడ్గము, నింద, అవమానము మొదలైన వాటికి భయపడక, హత సాక్ష్యము కొరకు నిలబడుదునని ప్రమాణము చేయుచున్నాను.

6) ఏ మతము వారుగాని, ఏ జాతి వారుగాని, ఏ జనము వారుగాని కనబడినప్పుడు, నేను రాకడ వర్తమానము చెప్పుదునని ప్రమాణము చేయుచున్నాను.

7) అన్యుల, అవిశ్వాసుల సహవాసమును చూచి, విశ్వాసుల యొక్కయు, దేవుని యొక్కయు సహవాసము చేయుచున్నాను.

8) అందరితోను సమాధానముగా యుందునని ప్రమాణము చేయుచున్నాను.

9) రాకడ వాగ్దానము నిలువబెట్టుదునని ప్రమాణము చేయుచున్నాను.

10) రాకడ పాటలు, రాకడ ధ్యానములు, రాకడ ప్రార్థనలు, రాకడ చందా ఇచ్చుచు, దినమునకు ఒకగంటయైన సన్నిధి చేసెదనని ప్రమాణము చేయుచున్నాను.

11) నేడును దేవుడు కనబడును, మాటలాడునని ఇతరుల ఎదుట ఒప్పుకొందునని, ప్రమాణము చేయుచున్నాను.

12) నీకును, సన్నిధికిని ప్రతి విషయములోను, సంపూర్ణముగా లోబడుదునని నేను ప్రమాణము చేయుచున్నాను. ఆమెన్. మరనాత.

## రెండవ రాకడ

రా : యదుకుల కాంభోజి తా : ఆది

(చాయ : ఎవరు భాగ్యవంతు లౌదు)

యేసు ప్రభువు వచ్చుచున్నా - రిదిగో వినరండి = పూర్వ -
దోసకారులు చంపిరి బ్రతికెను - దొడ్డ వరుడై వచ్చునండి
(ప్రకటన 22:12; హెబ్రీ 10:37) ||యేసు||

1. యూదులు పాలస్తీన వెళ్ళు - చున్నారను మాట = నిజము - ఈ దినాలలోనే
- క్రీస్తు యేసు వచ్చుట (యెషయా 5:26; జెఫన్యా 3:10) ||యేసు||

2. కారులు బస్సులు సంచరించు - కాల మిదే గదా = గనుక - ఆ రక్షకుని
రాకకు సిద్ధ - మౌ సమయంబునిదే గదా (నహూము 2:4) ||యేసు||

3. పని పాటులకు కరవైనట్టి - దినము వచ్చినది = క్రీస్తు - తన విశ్వాసులను
కొనిపోవు - తరుణము వచ్చినది (జెకర్యా 8:10) ||యేసు||

4. లోకమంతయును కలత - లోబడి బోయినది = క్రీస్తు - రాకడ గడియ
ఇపుడన్నట్టు - రానై యున్నది (మత్తయి 24:3-14) ||యేసు||

5. నమ్మువారికి చావే యుండదు - నవ రూపము గలుగు = వినక -
ఇమ్మహి మిగిలిన వారికి గొప్ప - హింసలు చెల రేగు (రోమా 8:9-11;
1కొరింథీ 15:50-52; ఫిలిప్పీ 3:21; 1థెస్స 4:13-18) ||యేసు||

6. వినుట విశ్వసించుట ఆజ్ఞకు - విధేయులై మనుట = ఈ పనులు -
మూడు చేయు వారే - పరలోక వాస్తవ్యులగుట
(రోమా 10:17; 1కొరింథీ 11:2) ||యేసు||

7. ఈ వేళ ప్రభువు వచ్చునని - ఎవరను కొందురో = వారు - దేవ పుత్రుని
రాకడ ఇచ్చు - దీవెన లొందుదురు (మత్తయి 24:42-46) ||యేసు||

8. మరనాత యనగా మన ప్రభువు - మరల వచ్చుట = దీనిన్ తరచుగా
సలామున వాడు - నరులు ధన్యులు (1 కొరింథీ 16:22) ||యేసు||

గుంటూరు నందు

| | | | |
|---|---|---|---|
| ప్రథమ ముద్రణ | 1963 | ప్రతులు | 1000 |
| రెండవ " | 1976 | " | 1000 |
| మూడవ " | 1980 | " | 1000 |
| నాల్గవ " | 1985 | " | 1000 |
| ఐదవ " | 1989 | " | 1000 |
| ఆరవ " | 1991 | " | 2000 |
| ఏడవ " | 1993 | " | 10,000 |
| ఎనిమిదవ " | 1997 | " | 10,000 |
| తొమ్మిదవ " | 2003 | " | 5000 |
| పదియవ " | 2005 | " | 10,000 |
| పదకొండవ " | 2008 | " | 5,000 |
| పన్నెండవ " | 2009 | " | 2,000 |
| పదమూడవ " | 2010 | " | 5,000 |
| పదునాల్గవ " | 2011 | " | 10,000 |

ఇది దేవుడు, యం. దేవదాసు అయ్యగారికి బైలుపరచిన

**బైబిలు మిషను ప్రచురణ**

ముద్రణ :

బైబిలు మిషను ప్రెస్, పెదకాకాని, గుంటూరు-522 509.

ఫోన్ : 0863- 2223718; 9949121777.